శుక్రవారం 15.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 124 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



పులివెందులలో 30 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యం వికసించింది. జడ్పీటీసీ ఉపఎన్నికలో టీడీపీ అభ్యర్థులు లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి ఘనవిజయం సాధించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రోత్సాహంతో ప్రజలు భయాన్ని దాటి స్వేచ్ఛగా ఓటు వేసి చరిత్ర సృష్టించారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# ఆదాయార్జనలో వృద్ధి సాధించాలి





- ఈఏడాది రాష్ట్ర ఆదాయంలో 8% వృద్ధి అంచనాలు
- పన్ను వసూళ్ల పర్యవేక్షణకు టాక్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం
- జీఐఎస్ టెక్నాలజీతో భూ వివరాల ల్యాండ్ మ్యాపింగ్
- ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆదాయంలో 8 శాతం వృద్ధి నమోదు కానుందనే అంచనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు... ఆదాయార్జనలో మరింత శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర నిధులు, టాక్స్ డెవల్యూషన్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఏపీ టాక్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా పన్ను వసూళ్లను పర్యవేక్షించాలని, సేవల రంగం ద్వారా ఎక్కువ పన్ను ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం ఆదాయార్జన శాఖలపై సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సొంత ఆదాయ వనరులు పెంచుకునేందుకు అన్ని మార్గాల పైన దృష్టి పెట్టాలని సూచించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో చేపట్టే కాంట్రాక్టు పనులకు వినియోగించే వాహనాల పెట్రోలు, డీజిల్ ఉత్పత్తులను రాష్ట్రంలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మిగతా 2లో...



## నేడు స్త్రీ శక్తి ప్రారంభం

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కానుకకు శ్రీకారం
- సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం "సూపర్ సిక్స్" హామీల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడలో శ్రీకారం చుట్టనున్నారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో

మిగతా 2లో...

## వైసీపీ డిపాజిట్లు గల్లంతు

### పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ ఘన విజయం

### డిపాజిట్ కోల్పోయిన వైఎస్సార్సీపీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నాలుగు దశాబ్దాలుగా పులివెందులపై వైఎస్ కుటుంబం బిగించిన పట్టు సడలింది. అక్కడ తెలుగుదేశం పార్టీ జెండా పాతింది. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి ఘన విజయం సాధించారు. ఆమె వైఎస్సార్సీపీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిపై 6035 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. లతారెడ్డికి 6,716 ఓట్లు రాగా హేమంత్?రెడ్డి 683 ఓట్లు పోలయ్యాయి. దీంతో వైఎస్సార్సీపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. పులివెందులలో స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్‌కు 100 లోపు ఓట్లు లభించాయి. ఈ స్థానానికి 11 మంది పోటీపడగా 74 శాతం ఓటింగ్ నమోదైంది. మరోవైపు ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి విజయం విజయం సాధించారు. వైఎస్సార్సీపీ అభ్యర్థి సుబ్బారెడ్డిపై 6267 ఓట్ల తేడాతో ఆయన గెలుపొందారు. ముద్దుకృష్ణారెడ్డికి 12,780 ఓట్లు రాగా సుబ్బారెడ్డికి 6513 ఓట్లు వచ్చాయి.

కంచుకోటగా భావించే పులివెందులలోనే జగన్‌కు ఘోర పరాభవం ఎదురైంది. వైఎస్ హయాం నుంచి దాదాపు 4 దశాబ్దాల తర్వాత ఇక్కడ టీడీపీ అద్భుత విజయం సాధించింది.



పులివెందులలో తొలిసారి ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన పోలింగ్‌లో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటేశారు. మొదటిసారి రక్తపాతం లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడంతో స్థానికులు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాలు ఓటర్లను ప్రభావితం చేశాయి.

దాదాపు 40 ఏళ్ల పాటు పులివెందుల ప్రాంతంపై వైఎస్ కుటుంబం ఏకఛత్రాధిపత్యంగా పాలించింది. ఇతరులు పోటీ చేయాలంటేనే భయపడేలా చేసింది. ఈ క్రమంలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రారంభం నుంచి కూటమి ప్రభుత్వం ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా చర్యలు చేపట్టింది. స్వేచ్ఛయుత పరిస్థితుల మధ్య 11 మంది

మిగతా 2లో...



## నీట్ ర్యాంకర్‌కు లోకేష్ అండ

- నీట్ ర్యాంక్ సాధించిన దివ్యాంగ విద్యార్థికి అండగా నిలిచిన మంత్రి నారా లోకేష్
- ఇంటర్ లో ఇంగ్లీష్ సబ్జెక్ట్ కు మినహాయింపు పొందిన హరిహర బ్రహ్మారెడ్డి
- నీట్ లో తప్పనిసరి కావడంతో మంత్రి నారా లోకేష్ ను ఆశ్రయించిన విద్యార్థి
- ప్రత్యేక జీవో ద్వారా మెడికల్ సీటుకు మార్గం సుగమం చేసిన మంత్రి లోకేష్

మిగతా 2లో...

## సూపర్ సిక్స్ సూపర్ హిట్

- ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి
- నేటి నుంచే రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం
- 'స్త్రీ శక్తి' పేరుతో పథకాన్ని కూటమి నేతలతో కలిసి ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2.62 కోట్ల మంది రాష్ట్ర మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించేలా పథకం
- 74 శాతం బస్సుల్లో రాష్ట్రమంతా ఉచిత ప్రయాణానికి అవకాశం
- కొత్త పథకంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.1,942 కోట్ల భారం
- ఇప్పటికే పింఛన్లు, దీపం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల అమలు
- రెట్టింపు సంక్షేమం... రెట్టింపు సంతోషం అంటున్న లబ్దిదారులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సూపర్ సిక్స్ పథకాల అమలు కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పరిపూర్ణం చేస్తోంది. ఈ క్రమంలో మరో సూపర్ సిక్స్ పథకం అమలుకు సిద్ధమైంది. స్వాతంత్ర్య దినోత్సవం నాడు మహిళలకు ప్రయాణ ఖర్చుల భారం నుంచి విముక్తి కల్పిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే పథకాన్ని స్త్రీ శక్తి పేరుతో ఆగస్టు 15న ప్రారంభిస్తోంది. ఈ మేరకు శుక్రవారం స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ పిఎన్బిఎస్ లో కూటమి నేతలతో కలిసి ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తూ ఈ పథకాన్ని ప్రారంభించడం ద్వారా సూపర్ సిక్స్ పథకంలోని మరో ముఖ్యమైన పథకాన్ని అమల్లోకి తెచ్చినట్టు అవుతుంది.

మిగతా 2లో...

## పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది



- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలో కూటమిదే విజయమని వెల్లడి

2 లో

## అసెంబ్లీలో హైస్పీడ్ ముద్రణా యంత్రాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన వ్యవస్థ భవనంలో కోటిన్నర రూ.ల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక హైస్పీడ్ ముద్రణా యంత్రాలను గురువారం అసెంబ్లీ భవనంలో శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు, అసెంబ్లీ సెక్రటరీ-జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవరతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన ఈ అత్యాధునిక ముద్రణా యంత్రాలు శాసన సభ సమావేశాల్లోను, మరీ ముఖ్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోను కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అంతేగాక శాసన సభకు సంబంధించిన ముద్రణలన్నిటినీ, అంటే ప్రశ్నలు, ఎజండా పత్రాలు, సభా సంవాదాలు

మిగతా 2లో...

## కూటమి ప్రభుత్వంలో రైతే రాజు



**సంతబొమ్మాళి, (జర్నలిస్ట్ ఫైల్):** సంతబొమ్మాళి మండలం, పాలేశ్వర స్వామి గుడి నుంచి కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకూ రైతులు కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఎన్నికల హామీలో భాగంగా అన్నదాత – సుఖీభవ పథకానికి సంబంధించి తొలి విడత నిధులు ఇప్పటికే విడుదలయ్యాయి. రాష్ట్రంలో 46,85,838 మంది రైతులకు రూ.3,175 కోట్ల మేర రైతులకు లబ్ది చేకూరింది. ఇందుకు కృతజ్ఞతగా నిర్వహించిన ర్యాలీకి రైతులు తరలి వచ్చి తమ ఆనందం వ్యక్తం చేశారు. నిర్దిష్ట ప్రణాళికతో రూపొందించిన అన్నదాత సుఖీభవ పథకం తమకు ఎంతో ఆదరవుగా నిలిచిందని పేర్కొంటూ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎనిమిది కిలోమీటర్ల మేర సాగిన ఈ కృతజ్ఞతా ర్యాలీ అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యాలను తెలియజేస్తూ, ఇందుకు తీసుకుంటున్న చర్యలను అంకెలతో సహా అందరికీ అర్థం అయ్యే విధంగా వివరించారు. అలానే గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తూర్పారబట్టారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలన్నింటినీ 90 శాతం అమలు చేశామని అన్నారు. అన్నదాతలకు అండగా నిలిచి వారికి పెట్టుబడి సాయం కింద కూటమి ప్రభుత్వం ఏటా రైతులకు 20 వేల రూపాయలు అందజేయనుందని వెల్లడించారు.

మిగతా 3లో...

## ఒకే తాటిపై ఉండటం మన బాధ్యత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దేశ ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. 'ఎందరో మహనీయుల త్యాగాల పునాదులపై నిర్మితమైన స్వతంత్ర ప్రజాస్వామ్య సౌధం మన దేశం. మువ్వన్నెల జెండా

మిగతా 3లో...

## గౌతు లచ్చన్న పోరాట యోధుడు

- అధికారికంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్ర సవిత
- 16న రాష్ట్ర వ్యాప్తంగా సర్దార్ జయంతి
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు
- అణగారిన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న ఎనలేని సేవలు

2 లో

## 'యోగాంధ్ర-ఆరోగ్యాంధ్ర' శకటం

### వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు 'యోగాంధ్ర-ఆరోగ్యాంధ్ర' శకటం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడ లోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో యోగాంధ్ర-ఆరోగ్యాంధ్ర శకటం ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతుంది. యోగాకు మరింత ప్రాచుర్యాన్ని తీసుకొచ్చే చర్యల్లో భాగంగా వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు శకటాన్ని ప్రత్యేక హంగులతో సిద్ధం చేశారు.

మిగతా 3లో...





## జగన్ ఆశలు గల్లంతు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల, ఒంటిమిట్టలో తెలుగుదేశం పార్టీని ఓడించేందుకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఆ రెండు ప్రాంతాల ప్రజలు సైకిల్ వైపు నిలిచారు. దీంతో ఫ్యాన్ కొట్టుకుపోయింది. టీడీపీ విజయకేతనం ఎగురవేయగా వైసీపీ ఎదురుదెబ్బను టెస్ట్ చేసింది. అయినా ఆ పార్టీ నాయకులు వెనక్కి తగ్గేదిలేదని పోరాటం చేసేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఆ పోరాటం నుంచి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. కోర్టు తీర్పు పెట్టుకున్న ఆశలు సైతం గల్లంతయ్యాయి. దీంతో రెండు చోట్ల ఓటమిని ఒప్పుకోక తప్పసరి పరిస్థితి ఆ పార్టీది అయింది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు ఈ నెల 12న జరిగాయి. ప్రజలు భారీగా తరలివచ్చి ఓట్లు వేశారు. పులివెందులలో అయితే 30 ఏళ్ల తర్వాత పోలింగ్ జరగడంతో ప్రజలు ఓటింగ్‌కు పోటెత్తారు.

మిగతా 2లో...

# ఆదాయార్జనలో వృద్ధి సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)



కొన్ని కాంట్రాక్టు సంస్థలు పొరుగు రాష్ట్రాల్లో పెట్రోలియం ఉత్పత్తులు కొనుగోలు చేయటం వల్ల రాష్ట్ర ఆదాయం కోల్పోతున్నామని, దీనిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**మద్య ఆదాయం కంటే ప్రజారోగ్యమే ముఖ్యం :** కూటమి ప్రభుత్వానికి ఎక్సైజ్ ఆదాయం కంటే ప్రజారోగ్యమే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు, ఆర్థిక లావాదేవీలకు అనుగుణంగానే భూ రిజిస్ట్రేషన్ విలువలు ఉండాలని నిర్దేశించారు. క్రయ విక్రయాలను శాస్త్రీయంగా విశ్లేషించాలని... భూమి విలువలు పెంచుకుంటూ పోవటం సరికాదని అన్నారు. మార్కెట్ విలువలు, ప్రాపర్టీ డేటా కోసం డేటా అనలటిక్స్ వినియోగించాలని అన్నారు. పన్ను ఎగవేతలను గుర్తించడానికి, ప్రభుత్వ ఆదాయంలో లీకేజీలను అరికట్టేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు చేయండంతో పాటు సాంకేతిక వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.

**ఈవీలకు రాయితీల కొనసాగింపు :** భూమి వివరాలను జీఐఎస్ ద్వారా ల్యాండ్ మ్యాపింగ్ చేయాలని, ఈ-రిజిస్ట్రేషన్లు, బౌండరీలను జీఐఎస్ సహాయంతో మ్యాప్ చేయాలని సూచించారు. వాహనాల పన్ను చెల్లింపులు సక్రమంగా జరిగేలా ఆర్టీజీఎస్, సీసీ కెమెరాలను ఉపయోగించాలని సీఎం స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రస్తుతం ఇస్తున్న రాయితీని కొనసాగించాలని ఆదేశించారు. స్క్రాప్ వాహనాల పాలసీని కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేయాలని సీఎం సూచించారు. డ్రోన్, శాటిలైట్ టెక్నాలజీతో గనుల తవ్వకాలను గుర్తించి డేటా అనలటిక్స్ ద్వారా ఆదాయాన్ని పర్యవేక్షించాలని సీఎం స్పష్టం చేశారు.

**పురపాలికల్లో ఆటో మ్యూటేషన్ :** ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే వివరాలతో పాటు టెక్నాలజీ ఆధారంగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పోరేషన్లలో ఆటో మ్యూటేషన్ జరగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మున్సిపల్ రికార్డుల్లో తప్పులు సవరించి జియో ట్యాగింగ్ చేయాలని సీఎం సూచించారు. ఆధార్, మొబైల్, ఎలక్ట్రిసిటీ డేటాను కూడా అనుసంధానించి పన్ను వసూళ్ళ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. స్వామిత్వ సర్వే ద్వారా గ్రామకంఠాల గుర్తింపు ప్రక్రియ 2026 ఫిబ్రవరికి పూర్తి అవుతుందని అధికారులు తెలిపారు. పంచాయితీల్లో నిర్వహించే ఖాతాలను ఆడిట్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అటవీశాఖ వద్ద ఉన్న ఎర్రచందనం నిల్వలతో రూ.1,500 కోట్ల మేర ఆదాయం వచ్చే అవకాశముందని... అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలపై దృష్టి పెట్టాలన్నారు. వెదురు ఉత్పత్తుల ద్వారా ఆదాయం ఆర్జించే మార్గాలను కూడా చూడాలన్నారు.

# నేడు స్త్రీ శక్తి ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ రాష్ట్ర జనాబాలో దాదాపు 50 శాతం మంది మహిళలే ఉన్నారని, వారి అభ్యున్నతిని, సంక్షేమాన్ని కాంక్షిస్తూ మరియు వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా 'స్త్రీ శక్తి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కానుకకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారన్నారు. ఈ పథకం ద్వారా దాదాపు 2.50 కోట్ల మంది రాష్ట్ర మహిళలు రాష్ట్రంలోని 74 శాతం బస్సుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కలుగుచున్నదన్నారు. ఇందుకై రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.1,970 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు పర్చేందుకు డ్రైవర్లు మరియు కండక్టర్లకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుచున్నదన్నారు. ఉచిత ప్రయాణం సందర్భంగా ఉండే రద్దీ దృష్ట్యా ప్రయాణీకులతో మర్యాదపూర్వకంగా ఎటువంటి వాగ్వివాదాలకు అవకాశాలు ఇవ్వకుండా నడుచుకోవలసినదిగా సూచించడం జరుగుచున్నదన్నారు. TIMs ద్వారా "జీరో ఫేర్" టికెట్‌ను ఏ విధంగా ఇవ్వాలో ట్రైనింగ్ ఇవ్వబడుచున్నదన్నారు. అన్ని TIMs లో Software update చేసి వాటిని ఏ విధంగా ఆపరేట్ చేయాలో తర్ఫీదు అందజేయడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు.

APSRTC కి మొత్తం 11,449 బస్సులు ఉన్నాయని, ఇందులో 8,458 బస్సులు (74%) – అంటే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ. ఎక్స్ ప్రెస్, మరియు మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులలో ఈ ఉచిత ప్రయాణ పథకం అమలుకానున్నదని మంత్రి తెలిపారు. స్త్రీ శక్తి పథకాన్ని వినియోగించుకునే మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసి అని తెలిపేందుకై ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, రేషన్ కార్డు వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

# పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలు ప్రజాస్వామ్య బద్దంగా ఓటేసి కూటమిని గెలిపించారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి విజయం సంతోషాన్నిచ్చిందన్నారు. కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీ రావడం, వైసీపీకి డిపాజిట్ కూడా దక్కకపోవడం చూస్తుంటే అక్కడి ప్రజలకు వైసీపీపై ఎంత వ్యతిరేకత ఉందో ఆ పార్టీ నేతలు తెలుసుకోవాలని హితవు పలికారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందు పులివెందుల ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. జగన్ వ్యవహారశైలి అతని పతనానికి నాంది పలికిందన్నారు. ధైర్యంగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తామని భరోసా ఇచ్చామని, ఈ క్రమంలో మూడు దశాబ్దాల తర్వాత పులివెందుల ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓట్లేశారన్నారు. పులివెందుల ఓటమి జగన్ రెడ్డికి చెంపదెబ్బ అన్నారు. ఈ ఫలితాలతో జగన్ కు కనువిప్పు కలగాలని కోరుకుంటున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, సార్వత్రిక ఎన్నికల్లోనూ కూటమిదే విజయమన్నారు. ఇది ప్రజా విజయమని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు.

# సూపర్ సిక్స్ - సూపర్ హిట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు రవాణ శాఖ, ఆర్టీసీ సిద్ధమైంది. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్లు ఇవ్వడానికి అవసరమైన సాఫ్ట్ వేర్ కూడా సిద్ధం చేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు మహిళలకు ప్రభుత్వం కల్పించింది. ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్రంలోని సుమారు 2.62 కోట్ల మంది మహిళలు వినియోగించుకోవచ్చు. ఆర్టీసీ పరిధిలో మొత్తంగా 11,449 బస్సులు ఉంటే.. అందులో 74 శాతం బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ ఉచిత ప్రయాణాన్ని ట్రాన్స్ జెండర్లకు కూడా వర్తింప చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



**మహిళలకు తగ్గనున్న ప్రయాణ ఖర్చులు :** స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయి. ప్రభుత్వ అంచనా ప్రకారం మహిళలు వివిధ బస్సుల్లో వారానికి నాలుగు సార్లు సరాసరి ప్రయాణిస్తారు. ఇక ఉద్యోగాలు చేసే మహిళలైతే రోజు వారీ ప్రయాణిస్తారు. దీని నిమిత్తం నెలకు ఒక్కో మహిళకు సుమారుగా రూ.1000 నుంచి రూ.3000 వరకు ఖర్చు అవుతుంది. ముందుగా కేవలం సిటీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా.. బస్సులో ప్రయాణించే ప్రతి పేద, మధ్య తరగతి, సామాన్య మహిళకు ప్రయాణ ఖర్చు తగ్గించాలి, దూర ప్రయాణాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో కూడా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కోసం సుమారుగా రూ. 1942 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసికి చెల్లిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఈ మొత్తం భరించడం కష్టమే అయినా.. మహిళలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్గించేలా ఉంటుందని ప్రభుత్వం ఈ పథకం అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన హామీని నెరవేర్చినట్టు అయింది. ప్రయాణికులు రాష్ట్ర వాసులు అయ్యుండాలి. ఓటర్ ఐడీ, ఆధార్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ సహా ఇలాంటివి కండక్టర్లకు చూపించి ఉచిత ప్రయాణం చెయ్యవచ్చు. నాన్‌స్టాప్‌లు, సూపర్ లగ్జరీలు, ఏసీ బస్సులు, ఘాట్ రూట్లలో తిరిగే సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు.

**సూపర్ సిక్స్ - సూపర్ హిట్ :** కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేసేందుకు వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం ప్రజలకు అందుతోంది. ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌తో పాటు ప్రతీ వర్గానికి, ప్రతీ ప్రాంతానికి, ప్రతీ కుటుంబానికి, ప్రతీ పౌరునికి సాయంగా నిలబడుతూ సంక్షేమ పాలనకే కొత్త నిర్వచనం ఇస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజునే 5 సంతకాలతో ప్రధాన హామీల అమలుకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం వాటిని అమల్లోకి తెచ్చింది.

**ఎన్టీఆర్ భరోసా పింఛన్లు :** 'పేదల సేవలో' కార్యక్రమంలో 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటివద్దే పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థాన్ని ఇచ్చింది. మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో ఏడాదికి రూ.33,000 కోట్లు కేవలం పెన్షన్ల కోసమే ఖర్చు పెట్టడం లేదు. ఒక్క పింఛన్ల పంపిణీకే ఇప్పటికి రూ.40 వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసింది. 'తల్లికి వందనం' పథకంతో రూ.10 వేల కోట్లతో ఒక్కో విద్యార్థికి రూ.15,000 చొప్పున మొత్తం 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఒక కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలున్నా... వారందరికీ పథకాన్ని వర్తింప చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అని చెప్పినట్లుగానే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేశారు. ప్రతీ రైతుకు మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశారు. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించారు. దీపం-2 పథకం ద్వారా ఉచిత సిలిండర్లు ఇచ్చి వంటింటి ఖర్చు తగ్గించారు. ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. ఏటా రూ.2,684 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికి 2 కోట్ల రాయితీ సిలిండర్లు దీపం పథకం కింద ఇచ్చారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించారు. ఈ నెలాఖరుకు నియామకాలు పూర్తి చేస్తున్నారు. ప్రజలకు నాడు కునుకు లేకుండా చేసిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్'ను రద్దు చేసిన ప్రభుత్వం... మరోవైపు పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు తిరిగి తీసుకువచ్చింది. ఇప్పటి వరకు 204 అన్నా క్యాంటిన్లలో 5.16 కోట్ల మందికి రూ.5 లకే కడుపునింపారు.

**మొదటి నుంచి మహిళా సంక్షేమం :** ఆడబిడ్డలకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి పథకాలు, కార్యక్రమాలు అమలు చేసింది. ఎన్టీఆర్ హయాం నుంచి నేటి వరకు అనేక కార్యక్రమాలు మహిళావర్గం కోసం అమలు చేస్తున్నారు. 1983లో పార్టీ పెట్టిన తర్వాత మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. 1986లో మహిళలకు ఆస్తిహక్కు తెచ్చారు. మహిళల కోసం పద్మావతీ మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల్లో ఎన్టీఆర్ హయాంలో మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చారు. చంద్రబాబు హయాంలో ప్రతి కి.మీ.కు ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి 3 కి.మీ.కు ఒక అప్పర్ ప్రైమరీ, ప్రతి 5 కి.మీ.కు ఒక హైస్కూల్, ప్రతి మండలానికో జూనియర్ కళాశాల, ప్రతి డివిజన్ కో ఇంజినీరింగ్ కాలేజి, ప్రతీ జిల్లాకో మెడికల్ కాలేజ్, వందలాది ఇంజినీరింగ్ కాలేజీలు తెచ్చి మహిళలకు విద్యను దగ్గర చేశారు. మహిళలకు విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు – రివాల్వింగ్ ఫండ్ అందజేత వంటి కార్యక్రమాలతో ఆర్థికంగా వారిని నిలబెట్టారు. 1997లో బాలిక శిశు సంరక్షణ పథకం కింద పుట్టిన ఆడబిడ్డకు బ్యాంకులో రూ.5 వేలు డిపాజిట్ చేసి 12 ఏళ్లు వచ్చాక వడ్డీ సహా చెల్లింపు అనే కార్యక్రమాన్ని కూడా చంద్రబాబునాయుడు నాడు అమలు చేశారు. 8, 9, 10వ తరగతి విద్యార్థినిలకు ఉమ్మడి రాష్ట్రంలోనే ఉచిత సైకిళ్ల పథకం అమలు చేశారు. 2014 తరువాత కూడా ఆ పథకాన్ని అమలు చేశారు. తద్వారా గ్రామాల్లో ఆడబిడ్డలు స్కూళ్లకు వెళ్లడానికి సౌకర్యం కల్పించారు. 2014 తరువాత మహిళలకు 11 రకాల ఉచిత వైద్య పరీక్షలు, ఆత్మగౌరవం కింద మరుగుదొడ్లు మంజూరు చేశారు. అన్న అమృత హస్తం కింద గర్భిణిలకు, బాలింతలకు పౌష్టికాహారం ఇచ్చే కార్యక్రమం కూడా నాడు ప్రారంభించిందే. నవజాత శిశువులకు బేబీ కిట్లు, తల్లీ బిడ్డా ఎక్స్ ప్రెస్, బాలామృతం వంటి పథకాలతో తల్లులకు అండగా నిలిచారు. పెళ్లి కానుక వంటి పథకాలతో పేదింటి ఆడబిడ్డల పెళ్లికి సహాయం చేశారు.

# వైసీపీ డిపాజిట్లు గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్లు వేశారు. కానీ ప్రధానంగా పోటీ మాత్రం టీడీపీ, వైఎస్సార్సీపీ మధ్యే నడిచింది.

పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ వైఎస్సార్సీపీకి క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలిసొచ్చాయి. పోలింగ్ రోజూ ఘర్షలకు ఆ పార్టీ నేతలు శతవిధాల ప్రయత్నించారు. కానీ భారీ బందోబస్తు మధ్య జరిగిన ఎన్నికల్లో ప్రజలు తరలివచ్చి తమ తీర్పు చెప్పారు. టీడీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించారు. మరోవైపు అంతకుముందు ఓట్ల స్లిప్?లు కట్టలు కట్టేటప్పుడు ఓ స్లిప్ బయటపడింది. 30 ఏళ్ల తర్వాత ఓటు వేసినందుకు సంతోషంగా ఉందని ఓ ఓటర్ స్లిప్ రాసి బ్యాలెట్ బాక్సులో వేశాడు.

**సంబరాలు చేసుకున్న శ్రేణులు :** పులివెందుల జడ్పీటీసీగా గెలిచిన లతారెడ్డికి నారా భువనేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు. మీ అందరి సహకారంతోనే విజయం సాధించానని లతారెడ్డి, భువనేశ్వరికి వివరించారు. మరోవైపు ఉప ఎన్నికలో విజయంతో కడప హరిత హోటల్ వద్ద కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకల్లో టీడీపీ నేతలు సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీటెక్ రవితో పాటు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని మంత్రి సవిత పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందు అక్కడి ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పులివెందుల కోటను బద్దలు కొడతామని ఆమె స్పష్టం చేశారు. జడ్పీటీసీ గెలిచిన లతారెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కష్టపడిన పార్టీ కార్యకర్తలకు సవిత కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజాస్వామ్యబద్ధంగా జరిగితే టీడీపీకి ఓట్లు వేస్తారనేందుకు ఈ ఎన్నికలు నిదర్శనమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ చేతుల్లో ఉన్న సిట్టింగ్ స్థానాలను గెలుచుకున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నమ్మకంతో ప్రజలు విజయం కట్టబెట్టారని తెలిపారు. గతంలో పులివెందులలో ధైర్యంగా ఓట్లు వేసే పరిస్థితులు లేవని టీడీపీ నేత బీటెక్ రవి వివరించారు. ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు చేస్తామని ఓటర్లకు భరోసా ఇచ్చామన్నారు.

**జగన్‌కు బుద్ధి చెప్పాలనే ప్రజల ఆలోచన :** అప్పట్లో పోలింగ్ కేంద్రాలకు రానీయకుండా చేశారని కానీ ఇవాళ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓట్లు వేశారని బీటెక్ రవి అన్నారు. జగన్‌కు బుద్ధి చెప్పాలనే ప్రజల ఆలోచనతో పాటు ప్రభుత్వ పథకాలే టీడీపీ విజయానికి దోహదం చేసిందన్నారు. మరోవైపు పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక విజయంతో అనంతపురంలో సంబరాలు చేసుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నివాళులర్పించారు. 'గతంలో పులివెందుల ఎన్నికలు అప్రజాస్వామ్యం గా జరిగాయి. ప్రస్తుతం ప్రజాస్వామ్యబద్ధంగా ఇప్పుడు ఎన్నికలు జరిగాయి. పులివెందుల ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది. అక్కడి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. ప్రజలు తమ ఓటుహక్కును ధైర్యంగా వినియోగించుకున్నారు. గతంలో నామినేషన్ వేయడానికి నాయకులు భయపడే పరిస్థితి. ఈసారి నేతలు స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని' బాలకృష్ణ వ్యాఖ్యానించారు.

# అసెంబ్లీలో హైస్పీడ్ ముద్రణా యంత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

వంటి కీలకమైన పత్రాలను అత్యంత వేగంగా ముద్రించ గలుగుతాయని చెప్పారు.

స్పీకర్ గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈముద్రణా పరికరాలను పరిశీలించానని, వాటిని తక్షణం మార్పుచేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళిన ఫలితంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి కోటిన్నర రూ.లు మంజూరు చేయగా నేడు అత్యాధునిక ముద్రణా యంత్రాలను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు కర్నూల్ లోగల ప్రభుత్వ ముద్రణాలయానికి కూడా మరో కోటి రూ.లతో అత్యాధునిక ముద్రాణా యంత్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలను తుప్పు పట్టించినట్టే శాసన సభలోని ముద్రణా యంత్రాలకు కూడా తుప్పు పట్టించారని ఆ తుప్పును వదిలించే ప్రక్రియలో భాగంగానే నేడు ఈఆధునిక ముద్రణా యంత్రాలను ఏర్పాటు చేశామని ఆయన వ్యాఖ్యానించారు.



**శాసన సభ సమావేశాలు ఏడాదిలో కనీసం 60 రోజులైనా జరగాలి :** రాష్ట్ర శాసన సభ సమావేశాలు ఏడాదిలో కనీసం 60 రోజులైనా జరగాల్సిన అవసరం ఉందని, అప్పుడే ప్రజలకు సంబంధించిన అనేక అంశాలపై విస్తృతంగా సభలో చర్చించి వాటిని పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయోజనాలు అందించినట్టు అవుతుందని రాష్ట్ర శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. ఇదే అంశాన్ని పట్నాలో జరిగిన స్పీకర్ల సమావేశంలో స్పష్టంగా చెప్పామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ళ కాలంలో అసెంబ్లీ సమావేశాలను కేవలం 78 రోజులే నిర్వహించిందని, ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే 31 రోజుల పాటు సభ జరిగిందని ఆయన తెలిపారు.

**వైసిపి సభ్యులు సభకు రాకుంటే వారి 2 ప్రశ్నలను వేరే పార్టీకి కేటాయించే యోచన :** రాష్ట్ర శాసన సభ సమావేశాల సమయంలో ప్రతి రోజు ప్రశ్నోత్తరాల సమయంలో 10 ప్రశ్నలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం జరుగుతుందని, పార్టీల సంఖ్యా బలాన్ని బట్టి వైసిపికి 2 ప్రశ్నలు కేటాయించామని శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు చెప్పారు. అయితే వైసిపి సభ్యులు ఆరెండు ప్రశ్నలు సభకు సమర్పిస్తున్నారే గానీ, వాటిని అడిగేందుకు సభకు మాత్రం రావడం లేదని, అందువల్ల ఆరెండు ప్రశ్నలు వృధా అవుతున్నాయన్నారు. ఇక మీదట ఆవిధంగా ప్రశ్నలు వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత తనపై ఉందని ఆయన అన్నారు. ఇకనైనా వైసిపి సభ్యులు సభకు రావాలని హితవు పలుకుతూ, వస్తారో రారో కూడా స్పష్టంగా తెలియ జేయాలని, లేదంటే ఆ రెండు ప్రశ్నలను వేరే పార్టీకి కేటాయించే ఆలోచన చేయక తప్పదని స్పీకర్ అయ్యన్న పాత్రుడు స్పష్టం చేశారు.

# నీట్ ర్యాంకర్‌కు లోకేష్ అండ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గతంలో ఐఐటీ, ఎన్ఐటీ ర్యాంకర్లకు ఇంటర్ మార్కుల మెమో విషయంలో తలెత్తిన ఇబ్బందులపై తక్షణమే స్పందించి 25 మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్ కాపాడిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేడు నీట్ ర్యాంకర్ కు అండగా నిలిచారు. తిరుపతికి చెందిన దివ్యాంగ విద్యార్థి దాసారెడ్డి హరిహర బ్రహ్మారెడ్డి ఇంటర్ బైపీసీ ఇంగ్లీష్ మీడియంలో చదివాడు. అయితే దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్ లో ఫస్ట్ లేదా సెకెండ్ లాంగ్వేజ్ కింద ఇంగ్లీష్ ఎంచుకోకుండా మినహాయింపు ఉంది. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ యూజీ పరీక్షా ఫలితాల్లో దివ్యాంగ కేటగిరీలో 1174వ ర్యాంక్ సాధించిన హరిహర బ్రహ్మారెడ్డికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు లభించే అవకాశం ఉంది. ఈ నెల 19న కౌన్సిలింగ్ కు హాజరుకావాల్సి ఉంది. అయితే నీట్ నిబంధనల ప్రకారం ఇంటర్ లో తప్పనిసరిగా ఇంగ్లీష్ ను ఫస్ట్ లేదా సెకెండ్ లాంగ్వేజ్ గా ఎంచుకోవాలి. ఇంటర్ మార్కుల మెమోలో ఫస్ట్ లాంగ్వేజ్ అనే కాలమ్ వద్ద 'E' (ఎగ్జెంప్టెడ్) అని ఉండటంతో మెడికల్ సీటు కోల్పోతామని విద్యార్థితో పాటు తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ మంత్రి నారా లోకేష్ ను ఆశ్రయించారు. దీంతో తక్షణమే స్పందించిన మంత్రి లోకేష్.. గతంలో ఐఐటీ, ఎన్ఐటీ విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో కనీస మార్కులు 35 కలుపుతూ జారీ చేసిన ప్రత్యేక జీవో ద్వారానే బైపీసీ విద్యార్థికి కూడా మార్కుల మెమోలో కూడా కనీస మార్కులు కలిపి సమస్యను పరిష్కరించారు. తమకు అండగా నిలవడం పట్ల మంత్రి నారా లోకేష్ కు విద్యార్థి, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# గౌతు లచ్చన్న పోరాట యోధుడు



**పెనుకొండ/శ్రీసత్యసాయి, (జర్నలిస్ట్ ఫైల్):** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఆయన జయంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినందుకు సీఎం చంద్రబాబుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. 1909 ఆగస్టు 16న ప్రస్తుత శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకాలో బారువా గ్రామంలో ఒక సాధారణ గౌడ కుటుంబంలో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు 8వ సంతానంగా లచ్చన్న జన్మించారన్నారు. గౌతు లచ్చన్న పోరాట యోధుడే కాదు గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేశారని, హరిజన రక్షణ యాత్రలు నిర్వహించారని తెలిపారు. హరిజనులకు దేవాలయాల ప్రవేశాలు చేయించారన్నారు. బడుగు, బలహీన వర్గాల్లో విద్యావ్యాప్తికి రాత్రి బడులు నిర్వహించారన్నారు. జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున్న పోరాటం చేసిన యోధుడు గౌతు లచ్చన్న అని వెల్లడించారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు తన 21వ ఏటా గౌతు లచ్చన్న స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారన్నారు. ఎన్నో పర్యాయాలు జైలుకెళ్లారన్నారు. 1952లో సోంపేట నియోజకవర్గం నుంచి గెలుపొంది గౌతు లచ్చన్న మద్రాసు రాష్ట్ర శాసనసభలో తొలిసారిగా అడుగు పెట్టారన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటులో గౌతు లచ్చన్న కీలక పాత్ర పోషించారన్నారు. టంగుటూరు ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో లచ్చన్న మంత్రిగా పనిచేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా కూడా పనిచేసిన గౌతు లచ్చన్న తరవాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారన్నారు. గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19న కన్ను మూశారనన్నారు. కార్యదక్షత, ఉక్కు సంకల్పం వల్లే గౌతు లచ్చన్నకు సర్దార్ అని బిరుదు వచ్చిందన్నారు. దేశంలో సర్దార్ గా సర్దార్ వల్లభాయి పటేల్ కు, గౌతు లచ్చన్న మాత్రమే పేరుగాంచారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 16న ఆయన జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

# జగన్ ఆశలు గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

చెదరుమదురు ఘటన మినహా పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగింది. ఈ రోజు అనగా గురువారం రిజల్ట్స్ వచ్చాయి. పులివెందుల, ఒంటిమిట్టలో తెలుగుదేశ పార్టీ విజయం సాధించింది. అయితే ఈ ఎన్నికల పోలింగ్ లో అక్రమాలు జరిగాయని వైసీపీ నేతలు ఆరోపించారు. పులివెందుల, ఒంటిమిట్టలో రీపోలింగ్ నిర్వహించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఈ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. రీపోలింగ్ విషయం ఎన్నికల కమిషన్ చూసుకుంటుందని, తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, ఆ పార్టీ అధినేత జగన్‌కు ఎదురు దెబ్బ తగిలినట్టైంది. సొంత ఇలాక అయిన పులివెందులను పోగొట్టుకోవడంతో జగన్‌కు ఘోర పరాభవం జరిగినట్లు వైసీపీ కార్యకర్తలు ఫీల్ అవుతున్నారు. ఈ సమయంలో కోర్టుపై పెట్టుకున్న ఆశలు సైతం గల్లంతకావడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చూడాలి మరి అసెంబ్లీ నాటికి వైసీపీ మళ్లీ పుంజుకుంటుందేమో.

## పరుగులు పెడుతున్న పోలవరం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పోలవరం ప్రాజెక్టు పనులు పరుగులు పెడుతున్నారని మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు. అభివృద్ధికి కేర్ ఆఫ్ అడ్రస్ చంద్రబాబు అని ఆయన పేర్కొన్నారు. పోలవరం పనులపై మంత్రి నిమ్మల రామానాయుడు విడుదల చేసిన ఓ వీడియోను.. నారా లోకేష్ ఆ ట్వీట్కు జత చేశారు. 'పోలవరం డయాఫ్రం వాల్ మొత్తం పొడవు 1396 మీటర్లకు గానూ, 500 మీటర్ల నిర్మాణం పూర్తయింది. 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా, వరదల సమయంలో సైతం డివాటరింగ్ చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి...' అంటూ నిమ్మల రామానాయుడు పోస్ట్ చేశారు.

## ఒకే తాటిపై ఉండటం మన బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

సగర్వంగా రెపరెపలాడుతోంది అంటే ఆ త్యాగధనుల ఆత్మార్పణల ఫలితమే. దేశ ఐక్యత, శాంతిసౌభాగ్యాల సాధనలో ప్రతి ఒక్కరం భాగస్వాములం కావాలి. నుదిటి సిందూరం చూసి కాల్చి చంపేసే ఉగ్ర మూకలను తుదముట్టించి, వారిని పెంచి పోషిస్తున్న ముష్కరులను అన్ని విధాలుగా కట్టడి చేసే శక్తి సామర్థ్యాలు మనకు ఉన్నాయి. రక్షణ, అంతరిక్ష రంగాల్లో అభేద్యమైన స్థాయికి మన భారత దేశం చేరుతున్నందుకు ప్రతి ఒక్కరం గర్విద్దాము. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృఢ నాయకత్వంలో రక్షణపరంగానే కాకుండా ఆర్థికంగా పటిష్ఠ స్థితిలో ఉంటూ.. అంతర్జాతీయంగా మూడో స్థానానికి చేరువయ్యాము. దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి ఎట్టి పరిస్థితుల్లో భంగం కలగకుండా ఒకే తాటిపై ఉండటం మన బాధ్యత' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## కృష్ణానదిలో వరద ప్రవాహం కొనసాగింపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణానది ఎగువ ప్రాజెక్టులలో వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుతున్నప్పటికీ, ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని ఏపి విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ 5.39 లక్షల క్యూసెక్కులుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

వరద పూర్తిగా తగ్గేవరకు కృష్ణానది పరీవాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటకూడదని హెచ్చరించారు.

అల్పపీడనం ప్రభావంతో నేడు రాష్ట్రంలో చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించారు.

## ఉద్యోగుల పెండింగ్ పదోన్నతులకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఆగస్టు 15న విజయవాడ బస్టాండ్‌లో ప్రారంభించనున్న సందర్భంలో, ఆర్టీసి ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న పదోన్నతల ఫైల్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఏపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీశక్తి పథకం విజయవంతం కావడానికి ఆర్టీసి సిబ్బంది పూర్తి స్థాయి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా వేలాది మంది ఆర్టీసి ఉద్యోగులు పదోన్నతలు కోసం ఎదురుచూస్తూనే రిటైర్ అవుతున్నారని, దీనివల్ల ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొన్నట్లు వారు తెలిపారు. పదవీ విరమణ సమీపిస్తున్న అనేక మంది సిబ్బంది తమ కృషికి తగిన గుర్తింపు పొందకపోవడం బాధాకరమని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు."స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు సులభంగా, ఉచితంగా ప్రయాణించే అవకాశం పొందుతారు. అదే సమయంలో ఆర్టీసి ఉద్యోగుల పదోన్నతులు మంజూరైతే వారు మరింత ఉత్సాహంతో సేవలు అందించగలరు" అని పలిశెట్టి దామోదరరావు, జి.వి. నరసయ్య అభిప్రాయపడ్డారు. ఆగస్టు 15న మహిళలకు శుభవార్తతో పాటు ఆర్టీసి ఉద్యోగుల పెండింగ్ పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే అది ఆర్టీసి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని వారు తెలిపారు.

### ఆగష్టు 15న అసెంబ్లీ,ఏపి సచివాలయం,హైకోర్టుల్లో

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 15వతేదీ శుక్రవారం ఉదయం 8గం.లకు రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

**రాష్ట్ర శాసన సభ భవన ప్రాంగణంలో..**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 15వతేది శుక్రవారం ఉదయం 8.15 గం.లకు రాష్ట్ర శాసన సభ భవనం ముందు జరిగే వేడుకల్లో రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

**రాష్ట్ర సచివాలయం మొదటి భవనం వద్ద:**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర సచివాలయం మొదటి భవనం వద్ద ఉ. 7.30 గం.లకు జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

**రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రాంగణంలో..**

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నేలపాడులోని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్ద 15వ తేది ఉ. 10 గం.లకు జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

## 18న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

**తిరుమల:** శ్రీవారి భక్తుల సౌకర్యార్థం నవంబరు నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటాను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటి లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు 21న ఉదయం 10 గంటలకు.. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనుంది. 23న ఉదయం పదింటికి అంగ ప్రదక్షిణం, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ కోటా, మధ్యాహ్నం మూడింటికి వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 25న ఉదయం పదింటికి రూ.300 టికెట్ల కోటా(ప్రత్యేక ప్రవేశ దర్శనం), మధ్యాహ్నం మూడింటికి తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా అందుబాటులో ఉంచనున్నారు.

# కూటమి ప్రభుత్వంలో రైతే రాజు

(మొదటి పేజీ తరువాయి)



తొలివిడతలో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ. 5 వేలు, కేంద్రం వాటా రూ. 2 వేలు మొత్తం రూ. 7 వేల రూపాయలు చొప్పున ప్రతి రైతు ఖాతాలో జమ చేశామన్నారు. రైతుల సంక్షేమమే ప్రథమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని పునరుద్ఘాటించారు. తల్లికి వందనం పథకం అమలులో భాగంగా ఇంట్లో ఎంతమంది బడికి వెళ్లే పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు చొప్పున ఇచ్చామని తెలిపారు. ఇందుకు భిన్నంగా గత ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం అన్నది బడికి వెళ్లే పిల్లలుంటే, అందరికీ ఈ పథకం ఇస్తామని చెప్పి, ఎన్నికల్లో గెలిచాక మాట మార్చి... ఇంటికి ఒక్కరికే పరిమితం చేసి, చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. దీపం పథకం కింద ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపామని, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ఏటా రూ. 2,700 కోట్లు వెచ్చిస్తున్నామని అన్నారు. ఈ నెల ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకం కింద ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభం కానుందన్నారు. దీని వల్ల రాష్ట్రంలోని 2 కోట్ల 60 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరనుందని అన్నారు. ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు పెట్టి రూ. 5 కే భోజనం పెడుతుంటే గత ప్రభుత్వం క్యాంటీన్లను మూసేసిందని, క్యాంటీన్ లు పునఃప్రారంభించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

**కన్నుల పండుగగా కృతజ్ఞతా ర్యాలీ:** "గత ప్రభుత్వ అరాచక పాలనతో గాడి తప్పిన వ్యవస్థలన్నింటినీ గాడిలో పెడుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమానికీ, వారి వికాసానికీ కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది. విత్తనాల నుంచి విక్రయం వరకు రైతుల వెంట ఉండి అండగా నిలుస్తుంది. పంట ఇంటికి చేరాక ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతులకు సంబంధిత నగదు వారి ఖాతాలలో జమ చేయడం జరిగింది. ఇందులో ఎటువంటి అనుమానాలకూ తావు లేదు" అని అన్నారు. మొత్తం.....ట్రాక్టర్లతో 8 కిలోమీటర్ల మేరకు సాగిన ఈ కృతజ్ఞతా ర్యాలీ ఆసాంతం కన్నుల విందుగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

**గత ప్రభుత్వం రైతులను విస్మరించింది :**

గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ఐదేళ్ల పాటు పూర్తిగా విస్మరించిందని తీవ్ర స్థాయిలో మంత్రి అచ్చెన్న మండిపడ్డారు. గడిచిన ఐదేళ్లలో జగన్ రైతుల కోసం ఒక్కమంచి పనికూడా చేయలేదని అన్నారు. సెంటు భూమికి కూడా భూపరీక్షలు చేయలేదని ధ్వజమెత్తారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం వైకాపా హయాంలో ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని అన్నారు. గత ప్రభుత్వం తప్పులు దిద్దుతూ, వ్యవస్థలను గాడీ పెడుతూ, ఆర్థిక రంగానికి ఊతమిచ్చే నిర్ణయాలు తీసుకుని, తద్వారా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అలానే గతం కన్నా భిన్నంగా పాలన అందించడంతో గ్రామాలలో రైతులు బ్రహ్మరథం పడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇదే విధంగా రైతులకు మేలు చేసే విషయమై కూటమి ప్రభుత్వం మరింత అంకిత భావంతో పనిచేస్తుందని అన్నారు.

**వైకాపా పార్టీ జెండా మరికొద్ది రోజుల్లో పీకే పరిస్థితి ఉంది :** మొట్టమొదటి సారిగా పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని, కూటమి ప్రభుత్వానికి పులివెందుల ప్రజలు ఘనంగా మద్దతు తెలిపారని..ఇది ప్రజా విజయమని, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ రెడ్డికి లేదని మంత్రి అచ్చెన్న అన్నారు. 2024 ఎన్నికల ఫలితాల్లో 11 స్థానాలకే వైసీపీని ప్రజలు పరిమితం చేసిన నేటికీ జగన్ రెడ్డిలో మార్పు రాలేదన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రెస్ గా వైసీపీ పేరు పొందిందని, మరి కొద్ది రోజుల్లో వైకాపా పార్టీ జెండా పీకే పరిస్థితి ఉందని జోస్యం చెప్పారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన, భద్రత ఏర్పాట్లు చేయటంతో, వైసీపీ దొంగ ఓటర్లు, బెదిరింపులు, జిమ్మిక్కులు పనిచేయలేదన్నారు. జగన్ కుటుంబంపై మెజారిటీ ఓటర్లు ఎంత కసిగా, వ్యతిరేకంగా వున్నారో ఈ ZPTC ఉప ఎన్నికల ఫలితాన్ని బట్టి స్పష్టమవుతోందన్నారు. గత 30 ఏళ్లుగా పులివెందులలో ఏకగ్రీవంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించారని, ప్రత్యర్థులు ఎవ్వరూ నామినేషన్ వేయకుండా చేశారని... అంత భయానక వాతావరణాన్ని జగన్ సృష్టించాడని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రమేయంతో తెదేపా నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కొండంత ధైర్యం వచ్చిందని తెలిపారు. మద్యం కుంభకోణంలో చట్టం తన పని తాను చేసుకుంటుందని అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో 400 కోట్ల అవినీతి జరిగిందని, అన్నీ కూడా విచారణలో తెలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి పరిస్థితులు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు.

# 'యోగాంధ్ర-ఆరోగ్యాంధ్ర' శకటం





(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం, రాష్ట్రంలో ప్రసూతివైద్య సహాయకుల పాత్ర, ప్రజారోగ్యానికి సాంకేతిక సంజీవని – డిజిటల్ నర్వ్ సెంటర్, జాతీయ అంధత్వ నివారణ మరియు దృష్టి లోప నివారణ వంటి ముఖ్యమైన కార్యక్రమాల్ని ఈ శకటం ద్వారా వివరించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'యోగాంధ్ర 2025' ప్రచారాన్ని ప్రారంభించింది. "ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా" అనే ప్రపంచవ్యాప్త ఇతివృత్తంతో మే 21 నుండి జూన్ 21 వరకు 30 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2.44 కోట్లకు పైగా పౌరులను సమీకరించారు. ఈ ప్రచారంలో భాగంగా, ప్రజలలో అవగాహన కల్పించడంతో పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి 1.91 కోట్ల డిజిటల్ యోగా సర్టిఫికేట్లను జారీ చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మహిళలు, దివ్యాంగులు, గిరిజనుల కోసం ప్రత్యేక థీమాటిక్ యోగా దినోత్సవాలు, 100కు పైగా పర్యాటక కేంద్రాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉద్యమంలో భాగంగా జూన్ 21న విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం 'ఒకే వేదికపై అతిపెద్ద యోగా సెషన్'తో సహా 21 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు 2 గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది.

# ప్రపంచంతో పోటీపడాలి..

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నంలోని సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్ఎంఈఎల్‌ను సింగరేణి సీఎండీ బలరామ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడిభాగాలు తయారీ, పాత విడిభాగాలను మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ సంస్థలకు ఏపీహెచ్ఎంఈఎల్ కన్నా మించి మిషనరీ, మానవ వనరులు లేవని భట్టి విక్రమార్క అన్నారు. సంస్థలో పనిచేసే అధికారులు, కార్మికులకు నిబద్ధత, ప్రపంచంతో పోటీ పడగలం అన్న ఆలోచన ఉంటే.. మనం కూడా ప్రపంచంతో పోటీ పడగలమని డిప్యూటీ సీఎం భరోసా కల్పించారు.



ఈ సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీని నియమిస్తామని తెలిపారు. వారు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా ఏ తరహాలో ముందుకు పోవాలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అధికారులు, సిబ్బంది ఎంత బాగా పని చేస్తే అంత బాగా లాభాలు సాధిస్తామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, రాష్ట్రాల ప్రగతికి దోహదపడవచ్చు అని పేర్కొన్నారు. సంస్థను, ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచాలని, యంత్రాలకు ఓవరాలింగ్ చేయాలని, రంగులు వేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనిచేసే సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలని ఆదేశించారు. కార్మికుల శ్రమ, ఉన్నత ఆలోచనలతోనే ఈ పరిశ్రమ ముందుకు పోతుందన్నారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్‌కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మత్తు వరకే పరిమితం కాకుండా రాష్ట్రంలోనే కాదు, దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకొని బీహెచ్ఈఎల్ మాదిరిగా ఏపీహెచ్ఎంఈఎల్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సంస్థను భవిష్యత్తులో ఏ విధంగా అభివృద్ధి చేయాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

## రాబోయే 24గంటల్లో కోస్తాంధ్ర, యానాంలో ఆకస్మిక వరద ముప్పు

**అమరావతి:** అల్పపీడనం ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆకస్మిక వరద (ఫ్లాష్ ఫ్లడ్) ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, కేంద్ర పాలిత ప్రాంతం యానాంకు ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.



మరో వైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశముందని విశాఖ వాతావరణకేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. పశ్చిమ మధ్య – వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం.. పశ్చిమ వాయవ్య దిశగా ఉత్తరాంధ్ర –ఒడిశా వైపు కదిలే అవకాశముందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల వారం రోజుల పాటు కోస్తాంధ్రలో వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. గురువారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విజయనగరం, నంద్యాల, పల్నాడు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్టు చెప్పారు. గడచిన 24 గంటల్లో ఏలూరులో 22, ముమ్మిడివరంలో 18, అమలాపురంలో 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కళింగపట్నం, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం పోర్టుల్లో ప్రమాద సూచికను ఏగురవేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా నది పరివాహక, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. పంట్లు, నాటు పడవలపై నదిలో ప్రయాణించవద్దని సూచించారు. వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ఎగువ నుంచి వరదలతో అధికారులు అప్రమత్తమయ్యారు. బ్యారేజీ వద్ద 4 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

## సర్దార్ గౌతు లచ్చన్న జన్మదినాన్ని అధికారిక ఉత్సవంగా నిర్వహించనున్న ప్రభుత్వం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాహిత నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న జన్మదినమైన ఆగస్టు 16ను ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్సవంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

కులాలు, ప్రాంతాలకు అతీతంగా పేదల అభ్యున్నతికై జీవితాంతం శ్రమించిన మహనీయుని సేవలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్న, సర్దార్ వలభాయ్ పటేల్ తర్వాత 'సర్దార్' అనే గౌరవం పొందిన ఏకైక నేత అని మంత్రి గుర్తుచేశారు. అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన గళమెత్తడమే కాకుండా, దళితులకు దేవాలయ ప్రవేశం కల్పించడం, వారి విద్యాభివృద్ధికి శ్రమించడం వంటి సమాజపరమైన గొప్ప సేవలు అందించారని వివరించారు.

ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా, మంత్రిగా ప్రజల సంక్షేమానికి ఎనలేని కృషి చేసిన లచ్చన్న ఆశయ సాధనలో కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పునరంకితమవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

## బలంగా దేశ ఆర్థిక వ్యవస్థ.. 'ఆపరేషన్ సిందూర్'తో గట్టి గుణపాఠం: రాష్ట్రపతి ముర్ము



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ఈమేరకు ప్రసంగించారు. పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు.

'పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. మనల్ని విభజించాలనుకునే వారికి దీటైన జవాబు ఇచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు గుణపాఠం నేర్పింది. దేశాన్ని కాపాడే విషయంలో మన సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ ఆపరేషన్ చాటి చెప్పింది. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. సుపరిపాలన, అవినీతిని సహించని విధానాలతో భవిష్యత్తు వైపు దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటుతో.. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కశ్మీర్ లోయలో రైలు మార్గంతో స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం మరింత మెరుగుపడతాయి" అని పేర్కొన్నారు.

"శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం.. ఒక తరాన్ని గొప్ప కలలు కనేలా ప్రేరేపించింది. అదేవిధంగా దేశ మానవసహిత అంతరిక్ష కార్యక్రమం 'గగన్‌యాన్'కు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మరోవైపు.. నూతన ఆత్మవిశ్వాసంతో మన యువత క్రీడల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా చదరంగంలో మునుపెన్నడూ లేని విధంగా భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. 'జాతీయ విద్యా విధానం-2020' విస్తృత మార్పులు తీసుకొచ్చింది. దేశంలో ఆదాయ అసమానతలు తగ్గుతున్నాయి.

**ఆలోచనాత్మక ప్రసంగం: ప్రధాని మోదీ**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ సమష్టి పురోగతిని, రాబోయే అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేశారన్నారు. అదేవిధంగా.. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామికావాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## డిజిపి కార్యాలయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

**హైదరాబాద్,ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కేంద్రం చేబట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డిజిపి కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. పిఅండ్ ఎల్ ఐజి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు డిజిపి కార్యాలయ సిబ్బంది అందరు పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఐజి రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అందరు సమిష్టిగా పోరాడాలని, యువత పెడదారి పట్టకుండా చూడాలని కోరారు. ఈ క్రమంలో పోలీసులపై గురుతర బాధ్యత వుందని ఆయన అన్నారు. డ్రగ్స్ కట్టడికి అన్ని వర్గాల వారు విస్తృతంగా ప్రచారం చేయాలని, సమాజంలో అందరిని చైతన్యవంతులను చేయాలని ఆయన కోరారు. డ్రగ్స్ గురించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెంటనే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉండాలి

### టిపిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** భారీ వర్షాలతో రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రస్తుత అపత్కాలంలో ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉండాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. అధికార యంత్రాంగం సర్వశక్తులు ఒడ్డి పని చేస్తుందని వారికి స్థానిక పరిస్థితులపై మార్గదర్శకత్వం చేస్తూ సహక రించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రజలు, ప్రధానంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు వరదలతో చాలా కష్టపడుతున్నారని ఆవేదన చెందారు.వానబాదితులకు సహాయ సహకారాలు అందించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఎప్పుడిక్కడ ముందుకు వచ్చి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన హితవు చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి ప్రజలను వరద బాధితులను ఆదుకోండి.ముంపునకు గురైన ప్రాంతాలలో పోలీసులు, మునిసిపల్ సిబ్బంది, రెవెన్యూ, హైడ్రా తదితర శాఖలు చేస్తున్న సేవలకు మీ వంతు బాధ్యతగా సహకారం అందించాలని ముంపు ప్రాంతాలలో ప్రజలకు ఏమైనా అవసరాలు ఉంటే మంచినీరు, పాలు, ఆహార పదార్థాలు అందించండని కోరారు.

## స్వేచ్ఛను అణగదొక్కేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు

### చంద్రబాబు, జగన్‌లు ఇద్దరూ బిజెపి బానిసలు: తూర్పు జగ్గారెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** దేశ ప్రజల స్వేచ్ఛను అణగదొక్కే కుట్ర బిజెపి, ఆర్ఎస్ఎస్ చేస్తున్నాయని, అందులో భాగంగానే రాహుల్ గాంధీ కుటుంబం మీద బిజెపి కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తూర్పుజగ్గారెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ మూడోసారి బిజెపి అధికారంలోకి రావడానికి దొంగఓటు కుట్రదోహద పడిందని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉండకూడదని బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు.ఎలక్షన్ కమిషన్ బిజెపి అడుగుజాడల్లో నడుస్తోందని,దొంగ ఓట్లను తయారుచేసే నైపుణ్యం కలిగినవి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు అన్నారు. దొంగ ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చారని జయప్రకాశ్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. చంద్రబాబు, జగన్‌లు ఇద్దరూ బిజెపి బానిసలు అంటూ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కల్లుదుకాణం తరహాలో ఉంటాయని తెలంగాణలో అందరు దమ్మున్న నాయకులే అని అన్నారు.

కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి ముఖ్యమంత్రిగా పనిచేశారని ఇప్పుడు బిజెపి స్క్రిప్ట్ చదవాలి కాబట్టి అదే చేశాడని అన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి బిజెపి లీడరా, ఎన్నికల కమిషనరా అర్థం కాలేదని,బిజెపి ప్రముఖ్ ఇచ్చిన చిట్టీ తీసుకుని చదివాడన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రిగా పని చేసినా పురందేశ్వరి ఎన్టీఆర్ కూతురైనా బిజెపి స్క్రిప్టు చదవాల్సిందే అని గుర్తు చేశారు.

## రాహుల్ ధర్నాలో జగన్ పాల్గొనాలి

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** తెలుగు ప్రజలను తప్పుదోవపట్టించేలా మాట్లాడటం మానుకొని విజయవాడలో జరగబోయే ధర్నాలో జగన్ కూడా రాహుల్‌గాంధీతో కలిసి పాల్గొనాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాహుల్, చంద్రబాబు మధ్య రేవంత్‌రెడ్డి హాట్‌లైన్‌లో ఉంచడం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై రాహుల్ మాట్లాడలేదంటూ జగన్ వ్యంగంగా మాట్లాడటం తగదని మీ రాష్ట్రంలో ఏమైనా తప్పులు జరిగితే,ఎన్నికల్లో ఓటమికి కారణాలపై ఇసి, మోడీ, అమిత్‌షాలను బ్లేమ్ చేయాలికానీ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిని కాదని ఆయన హితవుచెప్పారు.ఇంటిగ్రిటీ గురించి మాట్లాడటం చాలా ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. హర్యానా, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న నిర్ణయాలు దౌర్భాగ్యంగా ఉంటున్నాయని రాహుల్ అంటున్నారుఅలాంటిది మీరు రాహుల్‌గాంధీ మద్ధతు ఇవ్వాల్సిపోయి విమర్శలు చేయడం సబబు కాదన్నారు.ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత వైఎస్ జగన్ ఆలోచన విధానం ఏంటో నాకు అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే 18వ లోక్‌సభను కాపాడటానికే చంద్రబాబు ఎన్డీఏలో చేరారని లోక్‌సభలో ఎన్డీఏకూటమి బలం 275 దాటడానికి,మోడీసర్కారు అధికారంలో ఉండటానికి చంద్రబాబు కారకులని ఆయన తెలిపారు.

## కేంద్రీకృత అభివృద్ధి ఎంతో అవసరం

### సెస్ మాజీ ఛైర్మన్ సుదీప్తోం మండల్

**హైదరాబాద్,ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే ఉపాధి కేంద్రీ కృత అభివృద్ధి ఎంతో అవసరమని సెస్ మాజీ ఛైర్మన్ సుదీప్తోమండల్ అన్నారు. బుధవారం జరిగిన సెస్ మాజీ ఆర్ రాధాకృష్ణ స్మారకోపన్యాసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు అభివృద్ధిని స్థూల అభివృద్ధి సూచికగానే చూస్తున్నారు. కానీ గత దశాబ్దకాలం నుంచి స్థూల అభివృద్ధి సూచికలో పెరుగుదల ఉన్నా అభివృద్ధి సూచికలో మాత్రం పెరుగుదల కనపడం లేదన్నారు.ప్రపంచ ఆర్థికసూచిక (ఐఎంఎఫ్) వెల్లడించిన నివేదిక ప్రకారం భారతదేశస్థూల అభివృద్ధి 6.5శాతం పెరగడం ద్వారా చైనా దేశాన్ని అధిగమించడమే కాకుండా ప్రపంచంలో రెండో అతిపెద్దఆర్థిక వ్యవస్థగా రూపొందినట్లు చెప్పారు.దేశంలో ప్రధానమైన వ్యవసాయరంగం, ఉత్పత్తిరంగం ,తయారీ రంగంలో శ్రమతో కూడిన ఉపాధిని పెంచడానికి ఆయా రంగాలను ప్రోత్సహించేందుకు తగిన ఆర్థిక,సాంకేతిక సహకారాన్ని ప్రభుత్వాలు అందించాలని సూచించారు. విద్యారంగంలో సమూల మార్పును తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యావరణ సుస్థిరతను కాపాడుకు నేందుకు వ్యసాయరగంలో పలు కార్యక్రమాలను చేపట్టడంతోపాటు వాటికి సంబంధించిన ప్రభుత్వ విధానాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సెస్‌డైరక్టర్ ప్రొఫెసర్ రేవతి, సెస్ వ్యస్థాపక సభ్యుడు మహేందర్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు

## దేశ సమగ్రతకు యువత కృషి చేయాలి: కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** దేశ సమగ్రతకు యువత కృషి చేయాలని ఎంపీ, బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. వేముల రామకృష్ణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదగాల్సిన ఏ దేశమైన ఆదేశ యువత చేతిలో ఉంటుందని అన్నారు. 100 శాతం అక్షరాస్యత కలిగిన దేశంగా భారతదేశం అడుగులు వెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నోడికి లేనోడికి ఒకే విద్య అందివ్వాలని, యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ర్యాలీలో మేరా భారత్ మహాన్ వందేమాతరం నినాదాలతో తిరంగా జండా పట్టుకొని యువత వర్షం లెక్కచేయకుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, కోలా జనార్ధన్, నంద గోపాల్, పృథ్వి గౌడ్, మణికంఠ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగోలు ఆరోపణలు సరికాదు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల బ్యూరో (జర్నలిస్ట్‌ఫైల్)** గత ప్రభుత్వంలో అడ్డగోలుగా తప్పులు చేసి నేడు మాపై తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని టిఆర్ఎస్ నేత ప్రవీణ్ పై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డాడ. జగిత్యాల కేంద్రంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీ గెస్ట్ హౌస్‌లో బుధవారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. జీవో 17 గురించి కూడా ప్రవీణ్‌కు సరైన అవగాహన లేదని విమర్శించారు. కోడిగుడ్ల కొనుగోలు వ్యవహారంలో 600 కోట్ల అవినీతి జరిగింది అనే ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో జగిత్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , పొలాస నందయ్య జిల్లా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# హైడ్రా అన్నిరాష్ట్రాలకు అవసరం

### అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంటను సందర్శించిన ఢిల్లీ మున్సిపల్ బృందం



**హైదరాబాద్, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** హైడ్రా వంటి సంస్థ ప్రతి రాష్ట్రంలో ఉండాలని ఢిల్లీ మున్సిపల్ అధికారుల బృందం అభిప్రాయపడింది. అప్పుడే చెరువులు, నాళాలు, కాలువలు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయని పేర్కొంది. ఈమేరకు అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను ఢిల్లీ మున్సిపల్ అధికారుల బృందం సందర్శించింది. చెరువు చుట్టూ తిరుగుతూ.. అభివృద్ధిని దశలవారీ తెలుసుకుంది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఈ చెరువు నిర్మాణం జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిందని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీ మున్సిపల్ హార్టికల్చర్ విభాగం అధిపతి డా. ఆశిష్ అన్నారు. ఢిల్లీలో కూడా చెరువులు చాలవరకు కబ్జాకు గురి అయ్యాయని హైడ్రా వంటి సంస్థతో వాటిని పునరుద్ధరించడం, పరిరక్షించడం సులభం అవుతుందని అన్నారు. ఈ చెరువు లేనప్పుడు వరద ప్రభావం ఎలా ఉంది... ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై ఢిల్లీ బృందం ఆరతీసింది. చెరువు ఔట్‌లెట్లను కూడా ఈ బృందం పరిశీలించింది. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, చెరువులను అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండీ పి. యూనస్‌తో పాటు హెచ్ ఎండీఏ, ఆస్కీ అధికారులు కూడా ఢిల్లీ బృందంతో పాటు బతుకమ్మకుంటను సందర్శించిన వారిలో ఉన్నారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

### డిప్యూటీ సిఎం భట్టిని కోరిన ఎంపి ఆర్. కృష్ణయ్య



డిసిఎం భట్టివిక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రైవేట్ యూనివర్సిటీ అడ్మిషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నీలం వెంకటేష్, మణికంఠ, జిల్లపల్లి అంజి, భూపేష్, సి.రాజేందర్, పగిళ్ళ సతీష్, శివ, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ జవాన్ అనిల్‌కు అశ్రునివాళి

### సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

### కారేపల్లి క్రాస్ రోడ్డు నుండి సూర్య తండా వరకు భారీ బైక్ ర్యాలీ

### 8 నెలల బాబుని ఎత్తుకొని హృదయవిదారకంగా రోదించిన భార్య



**కారేపల్లి, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** దేశ సరిహద్దుల్లో 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ కాశ్మీర్ లోయలో జరిగిన ప్రమాదంలో వీరమరణం పొందిన ఖమ్మం జిల్లా సింగరేణి మండలం సూర్య తండా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బానోత్ అనిల్ కుమార్ కు అభిమానలోకం కన్నీటి వీడ్కోలు పలికింది. వీరుడా నీకు వందనం.. అమరుడా నీకు వందనం అంటూ నినదిస్తూ హోరెత్తించింది. అంతకుముందు ఆర్మీ అధికారులు అనిల్ భౌతిక కాయాన్ని ఆర్మీ వాహనంలో తీసుకురాగా, కారేపల్లి ఎక్స్ రోడ్ నుండి నుంచి స్వగ్రామం సూర్య తండా వరకు 10 కిలోమీటర్లు భారీ ర్యాలీ తీశారు. ఆర్మీ అధికారులు భౌతికకాయాన్ని మోసుకొచ్చి ఇంటి ముందు వేదికపై ఉంచగా, భార్య రేణుక తల్లి సాలు అన్న ప్రసాద్ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. అనంతరం అశేష జనవాహిని మధ్య ఇంటి నుంచి అంతిమ యాత్రగా వెళ్లి, పొలం వద్ద సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

**ప్రముఖుల నివాళి:** జవాన్ అనిల్ భౌతిక కాయం వద్ద పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వైరా శాసనస భ్యులు మాలోతు రాందాస్ నాయక్ ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ, మాజీ శాసనస భ్యులు లావుడియా రాములునాయక్ బానోత్ చంద్రావతి బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు నివాళి అర్పించారు.

## రాజకీయ అక్కసుతోనే తెలంగాణకు అన్యాయం

### సెమీ కండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో కేంద్రం వివక్ష

### పునఃపరిశీలించి న్యాయం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్

**(జర్నలిస్ట్‌ఫైల్)ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు14:** పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణకు రాజకీయ అక్కసుతోనే కేంద్రం అన్యాయం చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష చూపించి, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందంటూ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మండిపడ్డారు. ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో 10 ఎకరాల భూమి కేటాయించాం. అన్ని రకాల సబ్సిడీలకు ఆమోదం తెలిపాం. రికార్డు సమయంలో అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు మొదలు పెట్టేందుకు సదరు ఇన్వెస్టర్ సిద్ధంగా ఉన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు అని విమర్శించారు. అన్ని రకాలుగా అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధత లేని ఏపీకి ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు దేశ పారిశ్రామి కాభివృద్ధికి మంచిది కాదు. అందుకే ఈ నిర్ణయాన్ని మరోసారి పునఃపరిశీలించాల్సిన అవసరముంది. వాస్తవ పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని తెలంగాణకు మేలు చేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. న్యాయం జరిగేలా చొరవ చూపాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన తెలంగాణ బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికీ స్పందించకపోతే తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

## 19న ఓయు స్నాతకోత్సవంలో ఇస్రోఛైర్మన్ నారాయణన్‌కు డాక్టరేట్

**హైదరాబాద్,అగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ను ప్రకటించింది. ఈ నెల 19న జరగనున్న ఓయూ 84వ స్నాతకోత్సవంలో ఓయూ కులపతి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ హనోరిస్ (డాక్టరేట్ ఆఫ్ సైన్స్) అందించనున్నట్లు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం తెలిపారు.బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పాలక మండలి నిర్ణయాలను ప్రొఫెసర్ కుమార్ వివరించారు. ఇస్రో ఛైర్మన్ కు గౌరవ డాక్టరేట్ ప్రకటించటం ఆనందంగా ఉందన్నారు.ముఖ్యఅతిథిగా ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ 84వ ఓయూ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తారని,ప్రపంచానికి, దేశానికి ఆయా రంగాల్లో విశిష్టసేవలందించిన అత్యంత ప్రతిష్టాత్మక వ్యక్తులకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లు అందించి సత్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, రవీంద్ర నాథ్ ఠాగూర్, పండిట్‌జవహర్‌లాల్ నెహ్రూ, సి.రాజగోపాలాచారి, బాబూ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, యాసర్ అరాఫత్, డాక్టర్ వై. నాయుడమ్మ, డాక్టర్ మన్మోహన్ సింగ్, శంతను నారాయణ్, జస్టిస్ ఎన్.వి రమణ సహా 49 మంది ప్రముఖులను గౌరవ డాక్టరేట్లతో ఓయూ సత్కరించుకుందన్నారు. 50వ గౌరవ డాక్టరేట్ ను ఇస్రోఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు ఇవ్వాలని పాలకమండలి నిర్ణయించినట్లు చెప్పారు.

## తల్లిపాలవంటి మాతృభాష జాతి సంస్కృతికి ప్రతీక

### తెలంగాణ గవర్నరు, తెలుగు విశ్వవిద్యాలయం అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ

### వైభవంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు

### సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం




సత్యనారాయణ, మల్లికార్జున్‌లకు సంస్కృతి పురస్కారాలను ప్రదానం చేస్తున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, నిత్యానందరావు, బుద్ధప్రసాద్, రమణాచారి తదితర అతిథులు

**హైదరబాద్ (నాంపల్లి), ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** మాతృభాష తల్లిపాలంతటి ప్రాముఖ్యత గలదని, మాతృభాష పరస్పరం సంభాషణల కోసమేకాదు జాతి సాంస్కృతికి ప్రతీక అని తెలంగాణ రాష్ట్ర గవర్నరు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అందుకే జాతీయ నూతన విద్యావిధానంలో ప్రాథమికస్థాయి వరకు విద్యార్థులకు మాతృభాషలో బోధనకు ప్రాధాన్యం ఇచ్చిందంటూ ప్రతీఒక్కరూ విధిగా మాతృభాషలో వ్రాయడం, చదవడం అభ్యసించాలని, మాతృభాషలోనే మాట్లాడుకోవాలని, ప్రతీ ఇల్లు మాతృభాష పాఠశాల కావాలని సూచించారు. ప్రముఖ గాంధేయవాది, పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన సంఘసేవకుడు, మహోన్నత రాజకీయ నాయకుడు మండలి వెంకట కృష్ణారావు మాతృభాషకు చేసిన సేవలు అనితరసాధ్యమన్నారు. 1977లో ఏపి ఏర్పడిన భయంకర ఉప్పెన సమయంలో ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. తెలుగుజాతి ఐక్యతను, తెలుగుభాష-సాంస్కృతిక వికాసం, సంస్కృతి పరిరక్షణ, జాతీయ అంతర్జాతీయంగా చాటడానికి అంతర్జాతీయ తెలుగు కేంద్రాన్ని తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పెట్టడం, ప్రతీ సంవత్సరం ఆయన ఆశయానికి కృషిచేస్తున్న వారికి సంస్కృతి పురస్కారాలతో సత్కరించడం ముదావహం అన్నారు.

తండ్రి ఆశయాలకు కొనసాగిస్తూ అన్నివిధాలా పాటుపడుతున్న మండలి బుద్ధప్రసాద్‌ను ఎంతగానో అభినందించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిష్టాత్మక మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయం అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని గౌరవ అతిథులు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, ఏపి అవనిగడ్డ శాసనభ్యుడు, ఏపి శాసనసభ పూర్వ ఉపసభాపతి డా. మండలి బుద్ధప్రసాద్, విశ్వవి ద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమం తరావు తదితరులతో కలిసి అజో-విభొ-కందాళం ఫౌండేషన్, అమెరికా అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణను ఘనంగా సత్కరించి 2024 సంవత్సరానికిగాన తెలుగు భాషాభివృద్ధి మండలి, సోలాపూర్ అధ్యక్షుడు కమటం మల్లికార్జున్‌ను ఘనంగా సత్కరించి 2025 సంవత్సరానికిగాను సంస్కృతి పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపి తెలుగు భాష, సంస్కృతికి వారు చేస్తున్న కృషిని ప్రశం సించారు. ముందుగా సభకు విశ్వవిద్యాలయ విస్తరణ విభాగం రింగు రామమూర్తి స్వాగతం పలికారు. ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో గాంధేయ విలువలు, నైతిక నిష్ఠాగరిష్టతకు, ధర్మకర్తృత్వ సిద్ధాంతానికి, నిస్వార్ధసేవా పరాయణతకు నిలువెత్తు నిదర్శ నంగా నిలిచిన రాజకీయ నాయకుడు మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. పురస్కార స్వీకర్తలను అభినందించారు.

డా. కె.వి.రమణాచారి దేవుడిచ్చే ఆరు సుగుణాలు కలిగివున్న మండలి వెంకటకృష్ణారావు స్మరించుకొంటుండగా కుమారుడు బుద్ధప్రసాద్ వాటిని పుణికిపుచ్చుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

## ప్రాజెక్టులవద్ద వద్ద 24గంటలు పహారా

### అప్రమత్తంగా ఉండండి.. అలసత్వం వద్దు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో భారీ నుండి అతి భారీ వర్షాలు సంభవించే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖా హెచ్చరిస్తున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖాధికారులు పోలీసులు రెవెన్యూ అధికారులతో సమన్వయంగా ఉంటూ రోజంతా ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరా శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నీటిపారుదల శాఖాధికారులతో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించి, నాగార్జునసాగర్ ,జూరాల,కడెంతో సహా ప్రధాన ప్రాజెక్టుల పై సమీక్ష చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌లతో, నీటిపారుదల ఉన్నతాధికారులతో నిరంతరం సమాచారం అందించాలని ఆదేశాలు జారీచేశారు.నీటిపారుదల శాఖలో లష్కర్ నుంచి నీటిపారుదల సెక్రటరీ, ఇఎన్‌సి వంటి ఉన్నతాధికారుల వరకు అందరూ విధి నిర్వహణలో ఉండాలి..ఎవ్వరూ సెలవులలో ఉండకూడదు, కాలువలు, చెరువులు, ప్రాజెక్టులు అన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలన చేయండి. రాష్ట్రంలో ప్రాజెక్టులు, చెరువులు, కాలువల పరిస్థితి వాటి ఒ అండ్ ఎం విషయంలో తీసుకొన్న జాగ్రత్తలపై చర్చించి ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సవరించుకోవాలని తెలిపారు.

## ఆరు గ్యారెంటీలపై భట్టి విక్రమార్కకు కేటీఆర్ సవాల్

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 14:** దాదాపు అన్ని గ్యారంటీలు అమలు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దమ్ముంటే ఇదే మాట తెలంగాణలోని ఏదైనా ఒక గ్రామానికి వెళ్లి ప్రజలకు చెప్పాలని సవాలు విసిరారు. ఆరు గ్యారంటీల అమలుపైన కాంగ్రెస్ మోసాన్ని, ప్రాపగండాను చూసి కాంగ్రెస్ నేతలను గ్రామాల నుంచి తన్ని తరుముతున్నారని కేటీఆర్ తెలిపారు. భట్టి విక్రమార్కకు, ఆయన క్యాబినెట్ మంత్రులకు దమ్ముంటే ఏదైనా ఒక గ్రామానికి వెళ్లి ఆరు గ్యారంటీలు అమలు చేశామని చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ గ్రామం నుంచి వీళ్ళని తరిమి వేయకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాలు విసరారు. గ్యారంటీ కార్డులు దాచుకోండి, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండుసంవత్సరాలైనా ఒక్క గ్యారెంటీని సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వెంటనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి త్రాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి కనీస అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు.

## ఎంఎంఆర్‌పికి నీటి విడుదలచేయండి

### ఉత్తమ్‌కు శాసనమండలి ఛైర్మన్ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):** ఎఎంఆర్‌పి ప్రాజెక్ట్ 5వ యూనిట్ , పుట్టంగండి దగ్గర మోటార్ ని అమర్చి, 3.20 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ కోరారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాస్తూ ఐదవ యూనిట్ మోటార్ వల్ల నల్గొండ జిల్లాలోని 21 మండలాలకు నీరందుతుందని ఆయన లేఖలో పేర్కొన్నారు . కేవలం 148.30 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తే జిల్లాలోని రైతులకు లాభం చేకూరుతుందని గుత్తా సుఖేందర్ రెడ్డి లేఖ ద్వారా ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు.

## ఇగ్నో ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణి




**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):**

ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్య క్రమంలో భాగంగా ఎస్.కె.పి.వి.వి. హిందూ హైస్కూల్ విద్యార్థులకు మరియు పరిసర ప్రాంత గృహ నివాసులకు ఉచితంగా ఇంటింటికీ జాతీయ జెండాలను ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె. సుమలత బుదవారం పంపిణి చేసారు. అలాగే హిందూ హై స్కూల్ ఎన్ సిసి విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో కలిసి ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సిబ్బంది హర్ ఘర్ తిరంగా ర్యాలిని కొత్తపేట లోని హిందూ హై స్కూల్ పరిసర ప్రాంత వీదులలో జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలియచేస్తూ అవగాహన ర్యాలిని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. సుమలత మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్య క్రమం ద్వారా దేశ సమైక్యతను పెంపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని అలాగే జాతీయ జెండాను ప్రముకృతను ఇంటిలోని కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల ఉన్న ఇతరులకు కూడా తెలియచేయాలని కోరారు. హర్ ఘర్ తిరంగా కార్య క్రమం దేశవ్యాపతంగా నిర్వహించుకుంటున్న 'సందర్భంలో ఇగ్నో విద్యార్థులకు ఉపాధ్యాయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో సిబ్బంది డాక్టర్ ప్రసాద్ బాబు, డాక్టర్ శరత్ చంద్ర, బాల చందర్ మరియు ఇగ్నో సిబ్బంది తో పాటు హిందూ హై స్కూల్ ప్రధాన ఉపాద్యాయులు కంచెర్ల శ్రీనివాస రావు, ఎన్ సిసి అధికారి బ్రహ్మేశ్వర రావు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధన్వంతరి వనం లో "కర్పూరం" మొక్క నాటిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్



**విజయవాడ, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):**

ఒన్ ఎర్త్ -ఒన్ లైఫ్ ఆధ్వర్యంలో, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధన్వంతరి వనం లో ఔషధ మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా,బుధవారం "కర్పూరం" మొక్కను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మశ, స్వయంగా నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మశ మాట్లాడుతూ -ఒన్ ఎర్త్ - ఒన్ లైఫ్ టెర్రస్ గార్డెన్ గ్రూప్ వారు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధన్వంతరి వనం కార్యక్రమంలో భాగంగా "కర్పూరం మొక్క" నాటడం అభినందనీయమని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో, మిద్దె తోటల ప్రోత్సాహంలో, అలాగే నగరాన్ని కాలుష్యరహిత నగరంగా మార్చే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో ఈ గ్రూప్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. వీరి సేవలకు పూర్తి సహకారం అందిస్తానని, రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలలో భాగస్వామ్యం కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఈ-ఓ ఎల్ గ్రూప్ అడ్మిన్స్ లీలాకుమారి ఏలూరి, అరికపూడి సురేష్, కో%-%అడ్మిన్స్ సత్తి వీరవనిత, తోట కృష్ణవేణి, అమీన్, మద్దిరాల కమలాకరరావు, తిరునవల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

## పేద రోగులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత

### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణా జిల్లా, గన్నవరం మండలంలో పేద రోగులకు మెరుగైన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా ప్రభుత్వం చేయూతనం దిస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే యార్లగడ్డ సిఫార్సు మేరకు గన్నవరం గ్రామానికి చెందిన చిలుకూరి విజయ స్వప్న కు రూ. 3లక్షలు, బుద్దవరం గ్రామానికి చెందిన పోతునూరు వెంకట రంగారావుకు రూ. 2.94లక్షలు, గొల్లనపల్లి గ్రామానికి చెందిన రితికా రెడ్డి కి రూ. 1.72 లక్షలు చొప్పున మొత్తం 109 మంది రోగులకు వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుండి రూ.62.48 లక్షల చెక్కులు, ఎల్ఓసిలు మంజూరు కాగా మంగళవారం రాత్రి రోగుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా అందచేశారు. మంగళవారం రాత్రి గన్నవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యార్లగడ్డ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం ఖరీదుగా మారిన ప్రస్తుత తరుణంలో రోగులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలోని రోగులకు పెద్ద ఎత్తున సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయిస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎల్ఓసి లను ఇప్పిస్తున్నట్లు చెప్పారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గన్నవరం, బాపులపాడు, విజయవాడరూరల్ మండల టిడిపి అధ్యక్షులు వరుసగా గూడపాటి తులసి మోహన్, దయల రాజేశ్వరావు, గొడ్డళ్ల చిన్న రామారావు, గన్నవరం ఏఎంసి ఉపాధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపాలకృష్ణ, వేగిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ జోలికెళ్లొద్దు




- లక్ష్య సాధన దిశగా అడుగులేయండి
- ఎన్డీపీఎస్ చట్టంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి
- యునైటెడ్ కాలేజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల స్వాగతోత్సవం 'సంయుక్త'లో ఈగల్ అధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ
- యునైటెడ్ విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ
- సృజనాత్మకంగా, స్ఫూర్తిదాయకంగా విద్యార్థుల కళా ప్రదర్శనలు
- కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయవాడ డీసీపీ కె.జి.వి. సరిత, ఈగల్ ఎస్పీ కె. నగేష్ బాబు

**విజయవాడ, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):**

విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా అడుగులేయాలని ఈగల్ అధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. యునైటెడ్ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల స్వాగత కార్యక్రమాన్ని 'సంయుక్త' పేరుతో బుధవారం నిర్వహించారు. గవర్నరుపేట మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐజీ ఆకే రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, క్రమ శిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని రవికృష్ణ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అటువంటి దుర్వ్యసనాల బారినపడితే జీవితం అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) చట్టం పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కేసుల్లో పట్టుబడిన వారికి 20 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ. 2 లక్షల వరకు జరిమానా విధించబడతాయని చెప్పారు. విద్యార్థులపై ఈ చట్టం కింద కేసు నమోదైతే జీవితం అంధకారంగా మారుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల వినియోగానికి, సరఫరాకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం, విజయవాడ డీసీపీ కె.జి.వి. సరిత మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని, దేశ ప్రగతికి కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం విద్యా సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. ఈగల్ ఎస్పీ కె. నగేష్ బాబు ప్రసంగిస్తూ.. ఆతిథ్య రంగంలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని, ఈ రంగాన్ని కెరీర్ గా ఎంచుకున్న యునైటెడ్ కాలేజీ విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్య సాధనలో విద్యార్థులే కీలకమని నగేష్ బాబు పేర్కొన్నారు. యునైటెడ్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ అబ్దుల్ రజాక్ ప్రసంగిస్తూ.. తమ విద్యార్థులందరూ ఐక్యంగా అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో, ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. యునైటెడ్ అనే తమ కళాశాల పేరుకు సంస్కృత అర్థమైన 'సంయుక్త'గా ఈ కార్యక్రమానికి నామకరణం చేశామని వివరించారు. విద్యార్థుల్లోని కళా నైపుణ్యాలను వెలికితీసి, వారిని బహుముఖ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటమే 'సంయుక్త' లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గెస్ట్ ఫ్యాకల్టీ అబ్దుల్ రెహమాన్, యునైటెడ్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీమా, ప్రిన్సిపాల్ జగదీష్ జంపన, ఈవెంట్ మేనేజర్ ఉష, ఈగల్ ఇన్స్పెక్టర్ ఎం. రవీంద్ర, ఎస్సై ఎం. వీరాంజనేయులు, యునైటెడ్ కళాశాల ఫ్యాకల్టీ బృందం, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఇటీవల ఐపీఎస్ హోదా పొందిన ఎస్పీ నగేష్ బాబును యునైటెడ్ కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి కృతజ్ఞతలు తెలిపిన టీడీపీ నేతలు





### ఆంధ్రప్రదేశ్ నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన ఎరుబోతు రమణారావు

**విజయవాడ, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):**

పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని బుధవారం కలిసి టీడీపీ సీనియర్ నాయకుడు, బిసి నాగవంశం సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ టిడిపి ఎక్స్ కార్పొరేటర్ ఫ్లోర్ లీడర్ ఎరుబోతు రమణారావుకి ఆంధ్రప్రదేశ్ నాగవంశం సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గం 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోలింగ్ బూత్ లు యూనిట్ కన్వీనర్ ముని పోలిపల్లి, 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు ముని కృష్ణ, మొకర అదిబాబు తెలుగుదేశం పార్టీ బీసీ రాష్ట్ర నాగవంశం సాధికార సమితి సభ్యులు. 17వ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు అవనాపు శ్రీను. మొకర అప్పలనాయుడు, కనకాల అప్పలనారాయణ, బోని తమ్మి నాయుడు, మొకర సాయికుమార్(శివ) విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టిఎన్టియుసి ఉపాధ్యక్షులు ముని అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## నాగ్‌పూర్‌లో రూ.700 కోట్లతో మణిపాల్ నూతన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు

**ముంబై, ఆగస్టు 14(జర్నలిస్ట్‌ఫైల్):**

భారతదేశంలోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణ ప్రదాతలలో ఒకటైన మణిపాల్ హాస్పిటల్స్, నాగ్‌పూర్‌లో అత్యాధునిక 350 పడకల మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేసింది. ఈ ముఖ్యమైన భాగస్వామ్యం ఈ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, ప్రాదాన్యతను తను మెరుగుపరచాలనే ఉమ్మడి లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతిపాదిత ఆసుపత్రి దాదాపు రూ.700 కోట్ల పెట్టుబడిని కలిగి ఉంటుంది మరియు దాదాపు 3,000 కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందం ముంబైలో సంతకం చేయబడింది మరియు ఈ ప్రాజెక్టును సకాలం లో పూర్తి చేయడానికి అవసరమైన అన్ని అనుమతులు, ఆమోదాలు మరియు ఆర్థిక ప్రోత్సాహకాలను సులభతరం చేస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ ఆసుపత్రి 2029లో ప్రారంభమవుతుంది, ఇది ఆరోగ్య సంరక్షణ అభివృద్ధికి ఒక ముఖ్యమైన మైలురాయిగా మారుతుంది, నాగ్‌పూర్ మరియు దాని సమీప ప్రాంతాల ప్రజలకు అధిక-నాణ్యత వైద్య సేవలను అందిస్తుంది. ఈ ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ, మణిపాల్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ దిలీప్ జోస్ మాట్లాడుతూ, "మహారాష్ట్ర ప్రభుత్వం అందించిన మద్దతుకు రాష్ట్ర ప్రజలకు సేవ చేయడానికి ఈ అవకాశాన్ని మాకు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ వ్యూహాత్మక విస్తరణ మణిపాల్ హాస్పిటల్స్ దార్శనికతకు అనుగుణంగా ఉంటుందన్నారు. అందరికీ అధునాతన వైద్య సంరక్షణను అందుబాటులోకి తీసుకోస్తామని, నాగ్‌పూర్‌లోని కొత్త




సౌకర్యం అధిక-నాణ్యత, బహుళ విభాగ ఆరోగ్య సంరక్షణను అత్యంత అవసరమైన సమాజాలకు దగ్గరగా తీసుకువస్తామని అన్నారు. మహారాష్ట్ర అంతటా సమానమైన మరియు ప్రభావవం తమైన సంరక్షణకు మా నిబద్ధతను బలోపేతం చేస్తామన్నారు. అదనంగా నాగ్‌పూర్‌లోని కొత్త ఆసుపత్రి కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్, ఆంకాలజీ సేవలు మొదలైన విస్తృత శ్రేణి ప్రత్యేక విభాగాలను అందిస్తుందని అన్నారు. ఆరోగ్య సంరక్షణలో అగ్రగామిగా, మణిపాల్ హాస్పిటల్స్ భారతదేశంలోని అగ్రశ్రేణి ఆరోగ్య సంరక్షణ ప్రదాతలలో ఒకటి, సరసమైన, అధిక-నాణ్యత ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంపై దృష్టి సారించి, ఏటా 7 మిలియన్లకు పైగా రోగులకు సేవలందిస్తోందనారు. మణిపాల్ యొక్క ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ నేడు 19 నగరాల్లో 38 ఆసుపత్రులను కలిగి ఉంది, 10,500ం పడకలు, 7,200ం వైద్యుల ప్రతిభావంతులైన బృందం మరియు 20,500 కంటే ఎక్కువ మంది ఉద్యోగుల సంఖ్యను కలిగి ఉందన్నారు. మణిపాల్ హాస్పిటల్స్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక మంది రోగులకు సమగ్రమైన నివారణ మరియు నివారణ సంరక్షణను అందిస్తుంది. మణిపాల్ హాస్పిటల్స్ ఎన్ ఏబి హెచ్,ఏఏహెచ్ ఆర్ పీపీ గుర్తింపు పొందినవి మరియు దాని నెట్‌వర్క్‌లోని చాలా ఆసుపత్రులు ఎన్ఏబీఎల్,ఈ ఆర్ బ్లడ్ బ్యాంక్ గుర్తింపు పొందినవి మరియు నర్సింగ్ ఎక్సలెన్స్‌కు గుర్తింపు పొందినవని అన్నారు.

# ట్రంప్, మోడీ మధ్య త్వరలో చర్చలు!



## సెప్టెంబర్ 26న అమెరికాకు ప్రధాని మోడీ

## ఐరాస సర్వసభ్యసమావేశంలో ప్రసంగం

## అనంతరం సుంకాల వివాదంపై ట్రంప్‌తో భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత్‌తో వాణిజ్యసుంకాలు అధికంగా విధించి వాణిజ్య యుద్ధానికి తెరతీసిన ట్రంప్ ఇపుడు భారత్‌తో సంప్రదింపులకు ఆసక్తిచూపిస్తున్నారు. 50శాతం సుంకాలు విధించి భారత్‌ను చిక్కుల్లోకి నెట్టాలని చూస్తున్న ట్రంప్ మరోవైపు పాకిస్థాన్‌తో దోస్తీకి తహతహలాడుతున్నారు. ఐఎంఎఫ్ రుణమంజూరులో ప్రాధాన్యత ఇవ్వడం, ఆసిమ్‌మునీర్‌కు రెండుసార్లు ఆతిథ్యం ఇచ్చి భారత్‌పై రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడుతున్న సంగతి ప్రపంచదేశాలకు తెలిసిందే. మరోపక్క భారత్‌తో చర్చలు సంప్రదింపులకు ఆసక్తిచూపిస్తున్న ట్రంప్‌ను దారిలోకి తెచ్చుకోవాలని భారత్‌సైతం పావులు కదుపుతోంది. కయ్యానికి కాలుదువ్వే వైఖరి లేదని, మిత్రదేశంతో చర్చలు సంప్రదింపులద్వారా పరిష్కరించుకోవాలనే చూస్తోంది. ఆదిశగా వచ్చే సెప్టెంబరు 26న న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించేందుకు మోడీ వెళ్తున్నారు. సమితికు చెందిన ఈ ప్రతిష్మాత్మక నవమావేశాల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా పలు దేశాల ప్రభుత్వాధినేతలతో భారత ప్రధాని భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యేకించి ట్రంప్ మోడీ భేటీకి అధికారికంగా షెడ్యూల్‌ను ఫిక్స్ చేయించేందుకు భారత విదేశాంగ శాఖ కసరత్తు మొదలుపెట్టిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. డొనాల్డ్ ట్రంప్ కూడా మోదీతో భేటీకి ఆసక్తితోనే ఉన్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశం ద్వారా అమెరికాతో ఏర్పడిన పొరపొచ్చాలను తొలగించుకొని, రాజీకి వచ్చే దిశగా భారత్ ప్రయత్నాలు చేసే ఛాన్స్ ఉందని పరిశీలకులు అంటున్నారు. ఒకవేళ ఈ భేటీ సవ్యంగా జరిగితే, అక్టోబరులో క్వాడ్ సదస్సు కోసం భారత్‌కు రావాల్సిందిగా ట్రంప్‌ను ప్రధాని మోడీ ఆహ్వానించే అవకాశం ఉంది. క్వాడ్ కూటమిలో అమెరికా, భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, జపాన్‌లు సభ్యదేశాలుగా ఉన్నాయి. వాస్తవానికి జూన్ నెలలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో పాటు భారత ప్రధాని మోడీని వైట్‌హౌస్‌కు ట్రంప్ ఆహ్వానించారు. అయితే ఆ ఆహ్వానాన్ని భారత్ తిరస్కరించింది. మునీర్‌తో కలిసి ట్రంప్‌తో భేటీ అయ్యేందుకు నో చెప్పింది. నాటి నుంచే భారత్ అమెరికా మధ్య గ్యాప్ పెరుగుతూ వచ్చింది. చివరిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరిలో వైట్ హౌస్ వేదికగా ట్రంప్‌తో నరేంద్రమోదీ సమావేశమయ్యారు. ఏడు నెలల గ్యాప్ తర్వాత సెప్టెంబరు చివరి వారంలో ఈ ఇద్దరూ మళ్లీ భేటీ కాబోతున్నారు.ట్రంప్ మోదీ భేటీకి సంబంధించిన అజెండాలో భారత్ అమెరికా మధ్య జరగాల్సిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఉండే అవకాశం ఉంది. భారత వ్యవసాయ రంగాన్ని, డైరీ రంగాన్ని అమెరికా కంపెనీల కోసం తెరిచేందుకు భారత్ విముఖంగా ఉంది. అయితే ఆ రంగాల్లోనూ తమ కంపెనీలకు ప్రవేశాన్ని కల్పించాల్సిందే అని అమెరికా వాదిస్తోంది. ఈ విభేదాల వల్లే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల నడుమ పలు విడతలుగా చర్చలు జరిగినా, ఏకాభిప్రాయం మాత్రం కుదరలేదు. దీంతో తొలుత భారతదేశానికి చెందిన వస్తు, ఉత్పత్తులపై అమెరికా 25 శాతం అదనపు దిగుమతి సుంకాన్ని విధించింది. ఆ తర్వాత కూడా ట్రేడ్ డీల్‌పై పురోగతి జరగకపోవడంతో ఈ సుంకాన్ని రెట్టింపు చేసి 50 శాతానికి చేర్చింది. ఇది ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానుంది. అంటే భారత్‌పై 50 శాతం సుంకం అమల్లోకి వచ్చిన దాదాపు నెల రోజుల తర్వాత ట్రంప్‌తో మోడీ భేటీ కాబోతున్నారు. ఈ సుంకాలను పూర్వ స్థితికి చేర్చాలని, వాణిజ్య ఒప్పందంపై చర్చలను ముందుకు తీసుకెళ్లాలని అమెరికాను భారత్ కోరే అవకాశం ఉంది. కేంద్ర బిందువుగా రష్యా ముడి చమురు ప్రస్తుతం భారత్‌పై అమెరికా ఆగ్రహం పెరిగేందుకు కారణమవుతున్న మరో ప్రధాన అంశం రష్యా ముడి చమురు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్‌ను కొనే అతిపెద్ద దేశంగా భారత్ ఉండటం అనేది అమెరికాను కలవరపరుస్తోంది. ముడి చమురును కొని భారత్ అందిస్తున్న నిధుల వల్లే ఉక్రెయిన్‌తో నేటికీ రష్యా యుద్ధాన్ని కొనసాగించగలుగుతోంది అనేది అగ్రరాజ్యం అభిప్రాయం. దీనిపై ట్రంప్‌కు మోడీక్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. చౌక ధరకు లభిస్తోందనే ఏకైక కారణంతోనే రష్యా నుంచి ముడి చమురును కొంటున్నామని భారత్ మొదటినుంచీ చెబుతోంది. భారతదేశ ఇంధన భద్రత కోసమే రష్యా ముడి చమురును కొంటున్నాం తప్ప, ఉక్రెయిన్ రష్యా యుద్ధంపై తమకు ఆసక్తి లేదని భారత్ అంటోంది. ఈ అంశాలను వివరించి భారత్‌పై ట్రంప్‌కు ఏర్పడిన దురుద్దేశాలను దూరం చేసేందుకు ప్రధానమంత్రి మోడీ ప్రయత్నించే అవకాశం ఉందని పరిశీలకులు అంటున్నారు.



# బీహార్ సర్‌లో 11 ధృవపత్రాల పరిశీలన మంచిదేకదా!

## పిటిషనర్లకు సుప్రీం బెంచ్ సూటి ప్రశ్నలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ (నిది) నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బీహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని, ప్రత్యేక సవరణలో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్నప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బీహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్ పోర్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని, ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో ఈసీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

# కౌన్‌బనేగా కరోడ్‌పతిలో ఆర్మీ అధికారులు!

## యూనిఫామ్‌తో రావడంపై నెట్టింట విమర్శల వెల్లువ

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** ప్రముఖ రియాలిటీ షో ఖికౌన్ బనేగా కరోడ్‌పతిఖి (కేబీసీ)లో భారత సైనిక అధికారులు పాల్గొనడం వివాదానికి దారితీసింది. పహల్గామ్ దాడి అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ షోలో కనిపించడంతో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగింది. సాయుధ దళాలను వ్యక్తిగత ప్రచారం (పీఆర్), రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారంటూ నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న ప్రసారం కానున్న ఈ ప్రత్యేక ఎపిసోడ్‌కు సంబంధించిన టీజర్‌ను నిర్వాహకులు ఇటీవలే విడుదల చేశారు. ఇందులో హోస్ట్ అమితాబ్ బచ్చన్ సైనిక అధికారులకు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రోమోలో కల్నల్ ఖురేషి మాట్లాడుతూ పాకిస్థాన్ పదేపదే ఉగ్ర చర్యలకు



పాల్పడుతోంది. దీనికి గట్టిగా బదులివ్వడం అవసరం, అందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని వివరించారు. ఈ ఎపిసోడ్‌లో వీరితో పాటు, భారత నావికాదళంలో యుద్ధనౌకకు కమాండర్‌గా నియమితులైన తొలి మహిళా అధికారి కమాండర్ ప్రేరణా దేవ్‌స్థలే కూడా పాల్గొన్నారు. అయితే, అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులు ఇలా యూనిఫాంలో ఒక ఎంటర్‌టైన్‌మెంట్ షోలో కనిపించడంపై నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏ దేశంలోనైనా కీలకమైన సైనిక ఆపరేషన్ తర్వాత అధికారులు ఇలా టీవీ షోలలో పాల్గొనడం చూశామా అన్నారు.

# బ్రిటన్ జైళ్లనుంచి 26 వేలమంది ఖైదీల విడుదల



**లండన్, ఆగస్టు 14:** సుమారు 26 వేల మంది ఖైదీలను బ్రిటన్ సర్కారు విడుదలచేసింది. జైళ్లలో సరిపోను స్థలం లేకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ప్రధాని కీర్ స్టార్మర్ సాఫ్ట్‌జస్టిస్ కార్యక్రమాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటికే బ్రిటన్ జైళ్లలో ఉన్న సుమారు 26 వేల మంది ఖైదీలు రిలీజైనట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాల శిక్షను అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఫ్రీ అయినట్లు వెల్లడించారు. ఖైదీలతో జైళ్లు నిండిపోయాయని, జైళ్లను ఫ్రీగా మార్చాలన్న ఉద్దేశంతో సాఫ్ట్ జస్టిస్ ప్రోగ్రామ్‌ను మొదలుపెట్టినట్లు ప్రధాని స్టార్మర్ ఇటీవల తెలిపారు. ప్రభుత్వ డేటా ప్రకారం సెప్టెంబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు 14 ఏళ్లకుపైగా శిక్ష పడిన సుమారు 248 మంది జైళ్ల నుంచి రిలీజయ్యారు. విడుదలైన ఖైదీల్లో 2600 విదేశీయులు కూడా ఉన్నారు. స్టార్మర్ ప్రభుత్వ స్కీమ్ కింద ప్రతి నెల సగటున 3461 మందిని విడుదల చేస్తున్నారు. 40 శాతం శిక్షను అనుభవించిన ఖైదీలను ఎక్కువగా రిలీజ్ చేశారు. అయితే ఈ ఏడాది కాలం పూర్తి అయ్యేలోగా దాదాపు 45 వేల మంది ఖైదీలు జైళ్ల నుంచి విడుదల అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రిలీజైన ఖైదీలు ప్రధాని స్టార్మర్‌కు థ్యాంక్స్ తెలిపారు. జీవితకాలం లేబర్‌పార్టీ ఓటర్లుగా మిగిలిపోతామన్నారు. కానీ కొందరు ఖైదీలు రిలీజైన వెంటనే మళ్లీ నేరాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. జైళ్లలో రద్దీని తగ్గించేందుకే ఖైదీలను విడుదల చేస్తున్నట్లు న్యాయశాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.



# బీహార్ బిజెపి నేతలకు రెండేసి ఓట్లు!

## ఆర్జేడి చీఫ్ తేజస్వియాదవ్ ధ్వజం

**పాట్నా,ఆగస్టు 14:** కేంద్ర ఎన్నికల సంఘంపై ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. బీహార్‌లోని బిజెపినేతలు, కార్యకర్తలకు ఒకే అసెంబ్లీ స్థానాల్లో రెండు చొప్పున ఓటరు ఐడీలను ఈసీ జారీ చేస్తోందని ఆయన ఆరోపించారు. విపక్ష నేతలు, కార్యకర్తల ఓట్లను మాత్రం తొలగిస్తోందన్నారు. తద్వారా రాష్ట్రంలోని ఓటరు జాబితాను తారుమారు చేసేందుకు బిజెపితో కలిసి ఈసీ పనిచేస్తోందని తేజస్వి ఆరోపించారు. బుధవారం పట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకుముందు బీహార్ డిప్యూటీ సీఎం విజయ్ సిన్హా గురించి తాము చెప్పామని, ఆ తర్వాతే అది నేరం, తప్పు అని అందరూ చెప్పడం మొదలుపెట్టారని గుర్తుచేశారు. ముజఫర్‌పుర్ మేయర్, ఆమె బంధువులకు రెండు ఓట్లున్నాయని బీహార్‌లోని ముజఫర్‌పుర్ మేయర్, బిజెపి నేత నిర్మలాదేవికి కూడా ఒకే అసెంబ్లీ స్థానంలో 2 ఓటరు ఐడీలు ఉన్నాయని తేజస్వి ఆరోపించారు. వాటిలోనూ సమాచారం భిన్నంగా ఉందన్నారు. నిర్మలాదేవికి చెందిన ఇద్దరు సమీప బంధువులకు కూడా 2 చొప్పున ఓటరు ఐడీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ సందర్భంగా ఇతర రాష్ట్రాలకు చెందినవారి పేర్లను ఓటరు జాబితాల్లో చేర్చారని తేజస్వి ధ్వజమెత్తారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో ఇలా జరగడం దారుణమన్నారు. గుజరాత్ ప్రజలు ఇప్పుడు బీహార్ ఓటర్లుగా మారుతున్నారని తేజస్వి చెప్పారు. గుజరాత్ వాస్తవ్యుడైన బీహార్ రాష్ట్ర బిజెపి ఇంఛార్జి భీఖూభాయ్ దల్సానియాకు కూడా పట్నాలో ఓటుహక్కు వచ్చిందన్నారు.

# యశ్వంత్‌వర్మ పై పార్టీల నోటీసును అనుమతించిన స్పీకర్ ఓం బిర్లా

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలంటూ వివిధ పార్టీలు ఇచ్చిన నోటీసును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. దీంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లయింది. నిబంధనల ప్రకారం ఈ అభియోగాలపై విచారణకు త్రిసభ్య కమిటీని ఆయన నియమించారు. దీనిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది బి.వీఆచార్య ఉన్నారు. 91 సంవత్సరాల ఆచార్య దాదాపు ఆరు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. కమిటీ వీలైనంత త్వరలో నివేదిక సమర్పిస్తుందని, అది అందేవరకు న్యాయమూర్తి తొలగింపు ప్రతిపాదన పెండింగ్‌లో ఉంటుందని ఓం బిర్లా ప్రకటించారు. జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించాలని 146 మంది లోక్‌సభ సభ్యులు ప్రతిపాదన సమర్పించారని తెలిపారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు అధికారిక నివాసంలో మార్చి 14న పెద్ద ఎత్తున నోట్లకట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది.

# సుప్రీం తీర్పును పునఃపరిశీలిస్తాం



## చీఫ్‌జస్టిస్ గవాయి

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** ఢిల్లీలో తీవ్రమైన సమస్యగా మారిన వీధికుక్కల బెడదపై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. వీటి వల్ల రేబిస్ మరణాలు పెరుగుతున్నాయని, 8 వారాల్లోపు వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ తీర్పుపై పలువురు ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తీర్పుపై పునరాలోచించాలని కోరతూ చీఫ్ జస్టిస్ కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంలో ప్రజల భద్రతకు, మూగజీవాల హక్కులకు మధ్య కచ్చితమైన సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. వీధికుక్కల సమస్యకు భావోద్వేగాలతో కాకుండా హేతుబద్ధమైన పరిష్కారం కనుగొనాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధికుక్కల దాడులు, వాటి నియంత్రణకు సంబంధించిన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ, సమాజంలో వీధికుక్కలకు ఆహారం పెట్టే జంతు ప్రేమికులు ఉన్నారు, అదే సమయంలో వాటిని చూసి భయపడే సామాన్య ప్రజలూ ఉన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేటప్పుడు ఇరువర్గాల వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. సమస్య తీవ్రతను తాము గుర్తిస్తున్నామని, దీనికి ఒక ఆచరణాత్మకమైన పరిష్కారం కనుగొనడమే లక్ష్యమని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో వీధికుక్కలు ప్రజలపై, ముఖ్యంగా పిల్లలపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. అయితే, వాటిని విచక్షణారహితంగా చంపడం కూడా పరిష్కారం కాదని స్పష్టం చేసింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడంలో స్థానిక సంస్థల పాత్ర కీలకమని గుర్తుచేసింది. ఈ సమస్యను మానవజంతు సంఘర్షణగా చూడకుండా, ఇద్దరికీ ఆమోదయోగ్యమైన మార్గాన్ని అన్వేషించాలని సూచించింది. ఈ అంశంపై ఒక సమగ్రమైన పరిష్కార మార్గాన్ని కనుగొనేందుకు ప్రయత్నిస్తామని చెబుతూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా కోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుని సతీమణి అరెస్టు



**సియోల్, ఆగస్టు 14:** దక్షిణకొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సతీమణి, మాజీ ఫస్ట్ లేడీ కిమ్ కియోన్ హీని అరెస్టు చేశారు. స్టాక్ మార్కెట్‌లో అవకతవకలు,మోసాలకు పాల్పడినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. మార్షల్ చట్టం అమలు చేసిన కేసులో ఇప్పటికే మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను జైల్లో వేసిన విషయం తెలిసిందే. సియోల్‌లో సుమారు నాలుగు గంటల పాటు మాజీ ఫస్ట్ లేడీ కిమ్‌ను విచారించారు. తాను ఏ తప్పు చేయలేదని ఆమె పేర్కొన్నారు. కానీ కోర్టు మాత్రం అరెస్టు వారెంట్ జారీ చేసింది. సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో కోర్టు ఆ ఆదేశాలు ఇచ్చింది. గతంలో కూడా మాజీ దేశాధ్యక్షులను జైలుకీడ్చిన ఘటనలు ఉన్నాయి.

# నిన్న ఆసిఫ్‌మునీర్.. నేడు ప్రధాని షరీఫ్!

## సింధుజలాలపై నోరుపారేసుకుంటున్న పాక్ ప్రముఖులు

**ఇస్లామాబాద్, ఆగస్టు 14:** సింధు నదీ జలాల విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ దేశానికి చెందిన ఒక్క నీటి చుక్కను కూడా శత్రువులు లాక్కోలేరని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా భారత్‌ను ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మా నీటిని అడ్డుకుంటామని బెదిరిస్తే, ఒక్క చుక్కను కూడా మీరు తీసుకోలేరని గుర్తుంచుకోండి. అలాంటి ప్రయత్నం చేస్తే గట్టి గుణపాఠం చెబుతామని వ్యాఖ్యానించారు. పహల్గామ్‌లో 26 మంది పౌరుల మృతికి కారణమైన ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజైన ఏప్రిల్ 23న, 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. నీటి ప్రవాహాన్ని అడ్డుకునే ఏ ప్రయత్నాన్నైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ పలుమార్లు స్పష్టం చేసింది. కేవలం ప్రధాని మాత్రమే కాకుండా, పాక్ సైన్యాధిపతి జనరల్ అసిమ్ మునీర్ కూడా తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ప్రవాస పాకిస్థానీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత్ డ్యామ్ కట్టే వరకు వేచి చూస్తాం, కట్టిన తర్వాత దాన్ని నాశనం చేస్తాం. సింధు నది భారతీయుల కుటుంబ ఆస్తి కాదని హెచ్చరించారు. పాక్ సైన్యాధిపతి వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్ పదేపదే అణు బెదిరింపులకు పాల్పడటం వారి నైజమని, ఉగ్రవాద గ్రూపులతో అక్కడి సైన్యం కుమ్మక్కైందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొంది. ఇటువంటి బెదిరింపులకు భారత్ తలొగ్గదని, దేశ భద్రత కోసం అన్ని చర్యలూ తీసుకుంటుందని స్పష్టం చేసింది. స్నేహపూర్వక దేశమైన అమెరికా గడ్డపై నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం విచారకరమని కూడా తెలిపింది. ఇదే అంశంపై



పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో చేసిన వ్యాఖ్యలకు బీజేపీ నేత, నటుడు మిథున్ చక్రవర్తి ఘాటుగా బదులిచ్చారు. శాంతిని ప్రేమించే పాక్ ప్రజలతో తమకు ఎలాంటి విరోధం లేదని, కానీ అక్కడి ప్రభుత్వ పెద్దలకే తమ హెచ్చరిక అని ఆయన స్పష్టం చేశారు.

# సంక్షిప్తంగా..

## భారత్, చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్ చైనా దేశాల మధ్య డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసెస్ పునఃప్రారంభం కాబోతున్నాయి. భారత్‌చైనా మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులను సెప్టెంబర్ నెలలో పునరుద్ధరించే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఎయిర్ ఇండియా, ఇండిగో తదితర విమానయాన సంస్థలు చైనాకు సర్వీసులను నడిపేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించినట్లు తెలిపింది. గల్వాన్ లోయలో 2020లో జరిగిన సైనిక ఘర్షణలతో భారత్‌చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలోనే రెండు దేశాల మధ్య డైరెక్టుగా నడిపే విమాన సర్వీసులను రద్దుచేశారు. అదేవిధంగా చైనాకు సంబంధించిన పలు యాప్‌లను భారత్ నిషేధించింది. చైనా పెట్టుబడులపై కూడా కేంద్ర ప్రభుత్వం సుముఖత చూపలేదు. చైనా దిగుమతులపై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. అయితే ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే దిశగా చర్యలు కొనసాగించడంతో సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి.

## ఐర్లాండ్‌లో మరో జాత్యంహంకార దాడి

**డబ్లిన్, ఆగస్టు 14:** డబ్లిన్‌లోని ఫెయిర్‌వ్యూ పార్క్‌లో ఆదివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో ఒక భారతీయుడిపై ముగ్గురు టీనేజర్లు దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి ఆసుపత్రిలో ఎనిమిది కుట్లు వేయాల్సి వచ్చింది. బాధితుడు తన అనుభవాన్ని వివరిస్తూ, నేను పార్క్ నుంచి ఇంటికి నడుస్తుండగా, ఒక టీనేజర్ ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వచ్చి నా కడుపులో తన్నాడు. నేను దూరంగా వెళ్లడానికి ప్రయత్నించగా, మరో ఇద్దరు వచ్చి నన్ను కొట్టడం ప్రారంభించారు. నేను నేలపై పడిపోయిన తర్వాత కూడా వారు నాపై దాడి కొనసాగించారు. ఒక వ్యక్తి తన మెటల్ వాటర్ బాటిల్‌తో నా కంటి మీద కొట్టాడని తెలిపాడు. ఈ ఘటన సమయంలో అక్కడ ఉన్న కొంతమంది చూస్తూ ఉన్నారే తప్ప జోక్యం చేసుకోలేదని, అయితే ఇద్దరు టీనేజ్ యువకులు తనకు సహాయం చేసి పోలీసులకు సమాచారం అందించారని బాధితుడు చెప్పాడు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణకు భారత్ బిడ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం దిశగా భారత్ ఒక కీలక ముందడుగు వేసింది. ఈ మెగా క్రీడల నిర్వహణకు భారత్ దాఖలు చేయనున్న బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో (ఎస్‌జీఎం) ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని ప్రధాన వేదికగా ప్రతిపాదిస్తూ ఈ బిడ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ పోటీ నుంచి కెనడా వైదొలగడంతో 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను పొందేందుకు భారత్‌కు అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఇప్పటికే ప్రాథమిక ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్, తుది బిడ్ పత్రాలను ఆగస్టు 31 లోపు సమర్పించాల్సి ఉంది. ఈ క్రీడల నిర్వహణకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఐఓఏ స్పష్టం చేసింది. ఈ సమావేశం అనంతరం ఐఓఏ జాయింట్ సెక్రటరీ కల్యాణ్ చౌబే మాట్లాడుతూ, జనరల్ హౌస్ ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించింది.

## ఎదురు కాల్పుల్లో భారత్ జవాను మృతి

**ఉరి, ఆగస్టు 14:** జమ్మూకశ్మీర్‌లోని ఉరి సెక్టార్ సమీపంలో ఇవాళ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. నియంత్రణ రేఖవద్ద జరిగిన కాల్పుల్లో ఓ సైనికుడు మృతిచెందాడు. ఇండియా, పాక్ సైనిక దళాలు ఫైరింగ్‌కు దిగాయి. చొరబాటు యత్నాన్ని ఆపే సమయంలో ఈ ఘటన జరిగింది. ఆర్మీ వర్గాల ప్రకారం ఈనెల 12వ తేదీ రాత్రి కొందరు చొరబాటుకు ప్రయత్నించారు. అయితే రెగ్యులర్‌కు భిన్నంగా ఈ చొరబాటు సాగినట్లు చెబుతున్నారు. చొరబాటు దారులకు అండగా పాకిస్థాన్ ఆర్మీ ఫైరింగ్ జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌లు ఈ ప్రయత్నానికి సహకరించినట్లు స్పష్టమవుతోంది. చొరబాటు జరిగే సమయంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఆ సమయంలో గాయపడ్డ జవాను ప్రాణాలు కోల్పోయాడు.




## వైనాట్ 175 అన్నావ్ ? ఇప్పుడేమైంది ?



- సొంత నియోజకవర్గ ప్రజలే ఛీకొట్టారు
- అహంకారానికి సరైన బుద్ధి చెప్పారు ?
- అభివృద్ధి వైపే ఓటేశారు
- పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ గెలుపుపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల కంచుకోటలో సైకిల్ సవారీ చేసిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఫలితాల్లో వైసీపీని మట్టి కరిపించి తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన సందర్భంగా స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైనాట్ 175 అని విర్రవీగిన జగన్మోహన్ రెడ్డి సైన్యానికి వైనాట్ పులివెందుల అని ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని స్పష్టం చేశారు. రాష్ట్రంలోనే కాకుండా సొంత నియోజకర్గంలోనూ ప్రజలకు జగన్ ను నమ్మే పరిస్థితిని కోల్పోయారని తెలిపారు. 30 ఏళ్లుగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ గెలుస్తున్నారని మండిపడ్డారు. తాము స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నామని ప్రజలు చెప్పడం ప్రజాస్వామ్య విజయమని తెలిపారు. అహంకారానికి, అభివృద్ధికి మధ్య జరిగిన ఎన్నికల్లో ప్రజలకు అభివృద్ధి వైపే నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోన్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ విధ్వంసం సృష్టించడమే జగన్ కు తెలిసిన పాలన అని విమర్శించారు. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ సుపరిపాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాసరావు, నిజాం, గొల్ల ప్రభాకర్, కొనగల సత్యనారాయణ, గుడిమెట్ల దయారత్నం, హఫీజ్, వంగర ఏడుకొండలు, పాటిబండ్ల బలరాం, వేల్పూరి కిరణ్, అచ్చి కిరణ్, మాలకొండయ్య, కందుకూరి వెంకట్, జానీ, ప్రభాకర్, కుమార్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాతాగోవింద మాంబకు శ్రావణ మాస సారే



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** గోవింద మాంబా సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారి సారే,చీర,పసుపు,కుంకుమ కార్యక్రమం శ్రీ బ్రహ్మణి సేవా సంస్థ కడప ఆధ్వర్యంలో గత సంవత్సరం తరహాలోనే ఈ సంవత్సరం కూడా చేస్తున్నట్టు అధ్యక్షురాలు అంకిరెడ్డిపల్లె రమాదేవి పత్రికా ప్రకటనలో తెలియచేసారు. ఈ ఉత్సవాలలో మఠం యొక్క ప్రముఖ శిష్యులు కర్ణాటక మాజీ మంత్రి మాజీ పార్లమెంట్ సభ్యులు (బళ్ళారి) వారి సతీమణి వనజమ్మ విశిష్ట అతిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 8 గంటలకు పార్క్ వద్ద కోలాటము మరియు భజనలతో కార్యక్రమం అంకురార్పణ జరుగుతుందని చెప్పారు. కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం అన్నప్రసాద సేవ భక్తులకు శిష్యులకు జరుపుతున్నామని తెలియజేశారు. ఈ మహోత్సవంలో స్వామి వారి భక్తులు,శిష్యులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కరుణా కటాక్షాలకు పాత్రులు కాగలరని ఈ ప్రకటనలో కోరారు. మహిళా భక్తులకు అమ్మవారి పూజ గాజులు పసుపు,కుంకుమలతో పాటుగా,జాకెట్ అమ్మవారి ప్రసాదంగా ఇస్తున్నట్టు రమాదేవి చెప్పారు.

## బ్రహ్మంగారిని దర్శించిన ట్రైనీ ఐఏఎస్ నేలటూరి శ్రీకాంత్ రెడ్డి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) :** కాలజ్ఞాన స్వరూపి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నీ ట్రైనీ ఐఏఎస్ నేలటూరి శ్రీకాంత్ కడప జిల్లా చెన్నూరు వాస్తవ్యులు నేడు బ్రహ్మంగారిమఠంకి విచ్చేసి బ్రహ్మంగారిని దర్శించుకోవడం జరిగింది. అదేవిధంగా బ్రహ్మంగారి మనవరాలు జగన్మాత ఈశ్వరి మాత ఆలయంలో మరియు కనుమ పోలేరమ్మ గుడిని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ జాన్సన్ సర్వేయర్ డిప్యూటీ తహసిల్దార్ సాంబశివారెడ్డి వీఆర్వో కాశి రెడ్డి హాజరయ్యారు. వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శనం అనంతరం మఠం మేనేజర్ ఈశ్వర చారి పూర్వపు పీఠాధిపతి కుమారుడు దత్తాత్రేయ స్వామి మరియు టిడిపి మండల నాయకులు శీలం నరసింహ గౌడ్ ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి శీలం లక్ష్మి నరసయ్య గౌడ్ ఇటికల రవికుమార్ తదితరులు పాల్గొని పూలమాలవేసి దుశ్శాలువతో సత్కరించారు.

## శ్రీశైలంలో 16న కృష్ణాష్టమి గోపూజ



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆగస్టు 16వ తేదీన శ్రీశైల దేవస్థానంలో విశేషంగా గోపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని 'శ్రీగోకులం' వద్ద గోవులకు, గోవత్సవములకు (దూడలకు) శాస్త్రోక్త పూజలు జరిపించబడతాయి. అదేవిధంగా గోసంరక్షణశాలలో కూడా ప్రత్యేక గోపూజ నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు. మన వేదసంస్కృతిలో గోవుకు ఉన్న విశిష్ట స్థానం, పురాణాలు, శాస్త్రాలలో గోపూజ ఫలితంపై ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ, గోవు సకల దేవతల ఆవాసమని, గోపూజ వలన దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుందని పురాణోక్తి ఉందని పేర్కొన్నారు. శ్రీకృష్ణపరమాత్మ గోకులంలో పెరిగి, గోవులను కాసి, గోపాలునిగా పేరుగాంచిన సందర్భాన్ని గుర్తుచేస్తూ, కృష్ణాష్టమి రోజున గోవును పూజించడం సంప్రదాయంగా కొనసాగుతోందని దేవస్థానం అధికారులు వివరించారు.

# ముంపుప్రాంతాల పరిశీలనలో మంత్రి నాదెండ్ల



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** అల్పపీడనం కారణంగా కురిసే భారీ వర్షాల వల్ల ప్రజలకు,పశువులకు ఎటువంటి ప్రాణనష్టం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొల్లిపర మండలంలోని ముంపు ప్రాంతాలను పరిశీలించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

తెనాలి నియోజకవర్గ పరిధిలోని, కొల్లిపర మండలం కరకట్ట సమీప వరద ముంపు ప్రాంతాలను గురువారం మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తెనాలి మండలంలోని గోలి డొంక ప్రాంతంలో వర్షపు నీటితో ముంపుకు గురైన వరి పంట పొలాలను పరిశీలించారు. అధికారుల ద్వారా, ఆ ప్రాంత రైతుల ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడుతు, అల్పపీడనం కారణంగా భారీగా కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణా నదికి వరద ఉధృతి పెరిగిందని అన్నారు. ప్రకాశం బ్యారేజీ నుండి 5లక్షల56 వేల క్యూసెక్కులు సముద్రంలోకి వదలడం జరిగిందన్నారు. దిగువ ప్రాంతాల వారికి వరద ముంపు కారణంగా ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. ప్రతి గ్రామంలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం, ఇంటింటికి వెళ్లి వృద్ధులకు,గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం తెనాలి మండలంలోని, గోలిడొంక ప్రాంతంలొ ముంపుకు గురైన వరి పొలాలను మంత్రి మనోహర్ పరిశీలించారు. రైతుల నుండి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు 7వేల మంది రైతులు వేసిన 14వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని, మరికొన్ని వివరాలు రావాల్సి ఉందన్నారు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారని చెప్పారు. ప్రభుత్వ పరంగా రైతులను, కౌలు రైతులను ఆదుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు బరోసా కల్పించారు. ముంపు పొలాలు పరిశీలనలొ మంత్రి మనోహర్ వెంట సబ్ కలెక్టర్ సంజనసింహ, కొల్లిపర గ్రామ టిడిపి నాయకులు,తెనాలి మండల తహశీల్దార్ కెవి. గోపాల కృష్ణ, మండల వ్యవసాయ అధికారి సుధీర్, ఎమ్ పిడిఒ అత్తోట దీప్తి,పలువురు అధికారులు, గోలి డొంక ప్రాంత రైతులు జనసేన శ్రేణులు ఉన్నారు.

# చుట్టగుంట మురికిపేటలో 50 ఇళ్లలోకి వర్షం నీరు

- శాశ్వత పరిష్కారం కోసం అవుట్‌ఫాల్ డ్రైన్, కల్వర్ట్ నిర్మాణం
- తక్షణ సహాయక చర్యలు ప్రారంభించిన నగర కమిషనర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారీ వర్షాల కారణంగా గుంటూరు నగరంలోని చుట్టగుంట మురికిపేటలో సుమారు 50 ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కల్వర్ట్, అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణం చేపడతామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.

గురువారం ఉదయం నుండి మురికిపేటలో పర్యటించిన కమిషనర్, నీటిమునిగిన ఇళ్లలోని నివాసితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తక్షణం త్రాగునీటి సరఫరా, భోజనం అందించడంతో పాటు డ్రైన్ ఆక్రమణల తొలగింపు పనులను స్వయంగా పర్యవేక్షించారు.

మొత్తం 120 ఇళ్లలో 50 ఇళ్ళు వర్ష ముంపుకు గురయ్యాయని కమిషనర్ వెల్లడించారు. పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి ఇష్టపడని నివాసితులకు మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. డ్రైన్ ఓవర్‌ఫ్లో కావడంతో లో లెవల్ ప్రాంతమైన మురికిపేటలో నీరు చేరిందని, త్వరలో అవుట్‌ఫాల్ డ్రైన్, చిలకలూరిపేట రోడ్ వైపు ప్రధాన కల్వర్ట్ నిర్మాణం ద్వారా శాశ్వత పరిష్కారం కల్పించనున్నట్లు చెప్పారు. గత సంవత్సరం నుండి డ్రైన్ పూడిక తీత, ఆక్రమణల తొలగింపు చర్యల వల్ల పెద్ద ఎత్తున నష్టం జరగలేదని, ఈ చర్యలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. మురికిపేటతో పాటు ఇతర లోతట్టు ప్రాంతాల్లోనూ ఆహారం, త్రాగునీరు అందించేందుకు కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారని తెలిపారు. నగర ప్రజలు ఏ సమస్య ఉన్నా జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103 కు ఫోన్ చేయాలని సూచించారు.

**యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపు, నీటి బెయిల్ అవుట్**

మురికిపేటకు నల్లపాడు పరిసర ప్రాంతం నుండి భారీ వర్షపు నీరు చేరడంతో పాటు డ్రైన్ ఆక్రమణల కారణంగా ఇళ్లలోకి నీరు రావడం గమనించిన కమిషనర్, ఉదయం 8 గంటల నుండి 7 జేసీబీలు, ట్రాక్టర్లతో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. వర్షపు నీటిని డ్రైన్‌లోకి మళ్లించి, ఆయిల్ ఇంజిన్‌ల సహాయంతో బెయిల్ అవుట్ చేయడం, ఇసుక బస్తాలు వేసి నీరు కాలనీలోకి చేరకుండా చర్యలు తీసుకున్నారు.

పర్యటనలో ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఇన్‌చార్జి ఎంహెచ్ఓ రామారావు, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్మల ఫార్మసీ కళాశాలలో దేశభక్తి సాంస్కృతిక పోటీలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల ఫార్మసీ కళాశాలలో లైబ్రరీ సెల్ ఆధ్వర్యంలో "నేషన్ ఫస్ట్ – ఆల్వేస్ ఫస్ట్" థీమ్‌తో దేశభక్తి సాంస్కృతిక పోటీలు ఘనంగా జరిగాయి. రోల్‌ప్లే, నృత్యం, గానం విభాగాలలో మొత్తం 52 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. స్వాతంత్ర్య సమరయోధులను అనుకరించిన విద్యార్థులు వారి త్యాగాలను ప్రతిబింబించగా, దేశభక్తి గీతాలు, నృత్యాలతో ప్రేరణ నింపారు. విజేతలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రేవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

కార్యక్రమంలో డా. జి. స్వప్న, డా. పి. లక్ష్మయ్య, డా. యూ. స్పందన, డా. కె. సౌజన్య, జి. సాయి శ్రీలక్ష్మి, డా. ఎస్. పద్మావతి, డా. ఎం. సుధీర్, డా. షేక్ ఫైజాన్ అలీ, డా. హరేకృష్ణరాయ్, డా. కె. నాగరాజు పాల్గొన్నారు. విజేతలుగా టి. సమీర్, జి. రేచెల్, కె. కీర్తి, కె. అనిత, జి. లావణ్య, కె. సాయి శ్రీయ, కె. పూర్ణిమ, డి. అమూల్య, కె. మోహనలక్ష్మి ఎంపికయ్యారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. రేఖా నరేష్ బాబు, లైబ్రరీ కమిటీ సభ్యులు సిస్టర్ వై. వీనా, కె.వి. లక్ష్మి, పి. దీప్తి, పివిఆర్. తేజా శృతి, బి. అలేఖ్య మరియు విద్యార్థి వాలంటీర్లు కార్యక్రమ విజయానికి సహకరించారు. చీఫ్ లైబ్రేరియన్ షేక్ రేష్మా పాల్గొన్న విద్యార్థులు, విజేతలు, లైబ్రరీ వాలంటీర్లను అభినందించారు. అదేవిధంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" క్యాంపెయిన్ నిర్వహించి, మై భారత్ పోర్టల్‌లో విద్యార్థుల పోస్టులను అప్‌లోడ్ చేసినట్లు రేఖా నరేష్ బాబు తెలిపారు.

# కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాలి : బాపట్ల ఆర్డిఓ గ్లోరియా



**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్):** విపత్తులు వచ్చిన సమయంలో కష్టాల్లో ఉన్న నిరుపేదలను ప్రతి ఒక్కరూ ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆర్డిఓ గ్లోరియా పిలుపునిచ్చారు. ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని మూడో వార్డు రాజీవ్ గాంధీ కాలనీలో పలు పేద కుటుంబాలకు ఆర్డీవో గ్లోరియా, తహసిల్దార్ షలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి చేతుల మీదగా ఆహార పొట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో గ్లోరియా మాట్లాడుతూ ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్నేహితులందరూ కలిసి పేదలను ఆదుకోవడానికి ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులలో ఏటువంటి పనులు చేసుకోలేని పేదలకు ఆహార పొట్లాలు అందించి వారి ఆకలి తీరుస్తున్నారన్నారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులను అభినందిస్తున్నామన్నారు. తహసిల్దార్ షలీమా మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు చేదుడుగా నిలుస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలతో పేదలకు అండగా నిలుస్తున్న స్నేహితులను అభినందిస్తున్నామని, తమ చేతుల మీదుగా పేదలకు ఆహార పొట్లాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు మద్దిబోయిన గోపి, భీమా కోటేశ్వరరావు, విన్నకోట శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు, యాలవల శ్రీనివాసరావు, తన్నీరు గోపి, షేక్ సుభాని, సిహెచ్ వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి అంకమ్మరావు, శ్రీనివాసరావు, కే రవి, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి పటిష్ట బందోబస్తు - జిల్లా కలెక్టర్, ఎస్పీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ రోజు కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, ఇతర అధికారులతో కలిసి వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

వీవీఐపీలు, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రేక్షకుల రాకపోకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, గ్యాలరీలు, స్టేజ్, ప్రధాన రహదారి, ప్రవేశ మార్గాలు వంటి ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలీస్ బలగాల కవాతు మార్గం, వివిధ శాఖల శకటాల ప్రదర్శన మార్గాన్ని పరిశీలించి, ఎటువంటి ఆటంకం లేకుండా ఘనంగా వేడుకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరేడ్ మైదానంలో ప్రవేశించే ప్రతి ఒక్కరినీ జిల్లా భద్రతా విభాగం సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు.

ప్రధాన రహదారి, స్టేజ్, గ్యాలరీలు, స్టాళ్లు, శకటాల ప్రాంతాలకు డీఎస్పీ లేదా సీఐ స్థాయి అధికారులను నియమించి, వారికి తగిన సిబ్బందిని కేటాయించి పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు పర్యవేక్షణలో పరేడ్ కమాండర్ ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి నేతృత్వంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు, వెస్ట్ డీఎస్పీ అరవింద్, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఎస్బి సీఐలు అలహరి శ్రీనివాస్, రాంబాబు, నగరంపాలెం సీఐ నజీర్ బేగ్, ఆర్ఐలు సురేష్, శివరామకృష్ణ తదితర పోలీసులు పాల్గొన్నారు.

## పులివెందుల ఫలితాలతో జగన్ రెడ్డి పతనం మొదలు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజాస్వామ్యాన్ని బతికించిన టీడీపీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల,ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగటంతో, తన ఓటమిని ముందే పసిగట్టిన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసహనంతో చంద్రబాబును దూషిస్తూ మాట్లాడుతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగా ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసారని, ఇప్పటికే తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేసారని, ఇది ఎన్డీయే కూటమితోనే సాధ్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

**చంద్రబాబు పై జగన్ రెడ్డి చేసిన మాటలు అసహనానికి, ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం**

పులివెందుల, ఒంటిమిట్ట ప్రజల న్యాయమైన తీర్పును తట్టుకోలేని వ్యక్తి ఈ విధంగా విరుచుకుపడతాడని, ఇది వైసీపీ పతనానికి, ఆయన వ్యక్తిత్వానికి సంకేతమని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను పక్కనబెట్టి, కక్షసాధింపు రాజకీయాలు, కేసులు పెట్టడం, ప్రతిపక్షనేతలను జైలుకు పంపడం, అవినీతి కుంభకోణాలు, కుటుంబపరంగా విభేదాలు సృష్టించడం – ఇవన్నీ జగన్ పాలనలో జరిగిన ఘోరాలు అని గళ్ళా మాధవి తీవ్రంగా విమర్శించారు. "ప్రజలు ఇక మిమ్మల్ని నమ్మి మోసపోరని, 2029లో కాకుండా, వచ్చే ఎన్నికలకే మీరు ప్రజల తీర్పుతో రాజకీయంగా కనుమరుగు అవ్వటం ఖాయమని" అంటూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు.

## శరణాలయం బాలబాలికలకు అన్నదానం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో వైజాగ్ లో ఉంటున్న మంగళగిరి కి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మోతుకూరి సుబ్బారావు సతీమణి స్వర్గీయ మోతుకూరి రాజ్యలక్ష్మి జయంతిని పురస్కరించుకొని ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం బాల బాలికలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికల సమక్షంలో మోతుకూరి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మోతుకూరి ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధి కొలిశెట్టి రాము మాట్లాడారు. సుబ్బారావు తమ సతీమణి స్వర్గీయ రాజ్యలక్ష్మి పేరు మీద వైజాగ్ లో పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ, వృద్ధులకు అన్నదానాలు చేయడంతో పాటు తమ సొంత ఊరిలో కూడా ఆమె పేరు మీద సేవా కార్యక్రమం చేయాలని ఉద్దేశంతో, వైజాగ్ నుంచి వచ్చి బాల బాలికలకు అన్నదాన కార్యక్రమం చేయడం అభినందనీయం అన్నారు. స్వర్గీయ రాజ్యలక్ష్మి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోతుకూరి ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు దానబోయిన చెంగారావు, గుడిపాటి వెంకటరమణ, రావూరి శ్రీనివాసరావు, దామర్ల కుబేరస్వామి, గౌస్ బేగ్, వాసిరెడ్డి కుమార్, బొర్రా ధన కోటేశ్వరరావు, శరణాలయం నిర్వాహకురాలు శ్రీమతి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజాస్వామ్య విజయం



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్)** బి మఠం మండల కేంద్రంలో మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ మాట్లాడుతూ పులివెందుల ఒంటిమిట్ట జడ్ పి టి సి ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించడం ఇది ప్రజాస్వామ్య విజయమని ఆయన పేర్కొన్నారు. ఒంటిమిట్ట పులివెందుల జడ్ పి టి సి ఉప ఎన్నికల విజయం కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి మరియు ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గెలుపొందిన పులివెందుల అభ్యర్థి లతా రెడ్డికి ఒంటిమిట్ట అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శీలం వనజ గౌడ్ పాల్గొన్నారు.

## శ్రీశైలం హాటకేశ్వరం, శిఖరేశ్వరాలయాల్లో భక్తులకు వసతి సౌకర్యం




**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్):** భక్తుల సౌకర్యార్థం శ్రీశైలంలో హాటకేశ్వరం మరియు శిఖరేశ్వరాలయాల వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ ద్వారా నిర్మించిన యాత్రికుల సౌకర్యాల కేంద్రాలు (టూరిస్ట్ అమెనిటీ సెంటర్లు) నేటి నుంచి భక్తులకు వసతి కల్పించనున్నాయి.

ఈ సెంటర్లలో బంకర్ బెడ్స్ ఏర్పాటు చేయబడి, ఒక్క బెడ్‌కు రోజువారీ అద్దె రూ. 60గా నిర్ణయించబడింది. ఈ సౌకర్యాలు రోజుకు 24 గంటలు భక్తులకు అందుబాటులో ఉండగా, మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీశైలాన్ని సందర్శించే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, భక్తుల రద్దీకి అనుగుణంగా సదుపాయాల విస్తరణకు దేవస్థానం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే హాటకేశ్వరం మరియు శిఖరేశ్వరాలయాల సౌకర్యాల కేంద్రాలలో వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## మెప్మా జూట్ బ్యాగ్స్ స్టాల్స్ ప్రారంభం



- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్స్ స్థానంలో జూట్ బ్యాగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు
- ఈ నెల 15 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా ఎపి సెక్రటేరియట్
- 2026 జూన్ 5 కల్లా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్


**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్స్ స్థానంలో జూట్ బ్యాగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో మెప్మా ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్స్ స్టాల్స్ ను రాష్ట్ర పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా రాష్ట్ర సచివాలయాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంలో భాగంగా ఈ జూట్ బ్యాగ్స్ స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్థానంలో పర్యావరణ అనుకూలమైన ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకువచ్చే దిశలో ఈ స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వచ్చే ఏడాది జూన్ 5 కల్లా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుకు నాంధి పలుకుతూ తొలుత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా రాష్ట్ర సచివాలయాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా స్టీల్ బాటిల్స్, జూట్స్ బ్యాగ్స్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందుకై పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి మిషన్ మోడ్ లో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ కార్యాచరణ అమల్లో భాగంగా తొలుత రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్టిక్కర్లు, సాచెట్లు మరియు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల అమ్మకం, పంపిణీ మరియు వాడకంపై తక్షణ నిషేధాన్ని అమలు చేయడం జరుగుచున్నదన్నారు. వీటి స్థానంలో పునర్వినియోగ, బయోడిగ్రేడబుల్ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టడం జరుగుచున్నదన్నారు.

అదే విధంగా రాష్ట్ర సచివాలయంలోని అన్ని బ్లాకుల్లో త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా ఆర్.ఓ. ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరుగుచున్నదని, సచివాలయ ఉద్యోగులకు పునర్వినియోగించదగిన స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఘన, ద్రవ్య మరియు ఇ-వ్యర్థాల సేకరణకు మూడు రంగుల డస్టు బిన్లను కూడా ఏర్పాటు చేయడం జరుగుచున్నదన్నారు. ఈ విదంగా రాష్ట్ర సచివాలయాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా రూపొందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో అమలు చేయడం జరుగుచున్నదని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ ఉద్యోగులు, సందర్శకులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ - మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## త్వరలో గుంటూరు జిజిహెచ్‌లో పెట్ - సీటీస్కాన్



- జీజీహెచ్ ను సందర్శించిన డా. దత్తాత్రేయుడు నోరి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ క్యాన్సర్ వైద్య సలహాదారుగా ఇటీవలే నియమితులైన ప్రఖ్యాత క్యాన్సర్ నిపుణుడు డా. దత్తాత్రేయుడు నోరి గురువారం ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)ను సందర్శించారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రితో పాటు, రాష్ట్రంలో ఉన్న నాలుగు క్యాన్సర్ హాస్పిటళ్లలో ఒకటైన నాట్కో%-%జిజిహెచ్ క్యాన్సర్ సెంటర్ ను పరిశీలించారు. మెడికల్ ఎడ్యుకేషన్ అదనపు డైరెక్టర్ డా. రఘునందన్, సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి. రమణ తో కలిసి ఆసుపత్రిలో ఏర్పాటుచేస్తున్న పెట్ - సీటీ స్కాన్ యంత్రాన్ని పరిశీలించారు. పెట్ - సీటీ స్కాన్ ఇన్‌స్టాలేషన్ పనుల ప్రగతిని క్యాన్సర్ విభాగ వైద్యులు వివరించారు. క్యాన్సర్ చికిత్సలో అత్యంత ప్రాధాన్యం గల ఈ సౌకర్యాన్ని త్వరలో అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపడతామని డా. దత్తాత్రేయుడు తెలిపారు. జనరల్ సర్జరీ, ఈఎన్టీ, ఆర్థోపెడిక్ సహా ట్యూమర్ కేసులన్నింటికి గుంటూరు నాట్కో సెంటర్‌లో సమగ్ర వైద్యం అందించనున్నట్లు చెప్పారు. అలాగే, ఇన్‌పేషెంట్లకు పెట్-సీటీ స్కాన్‌ను ఆరోగ్యశ్రీలో పొందుపరచే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాట్కో కోఆర్డినేటర్ వై. అశోక్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఒంటిమిట్టలోనూ టీడీపీ విజయం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీకి మరో షాక్ తగిలింది. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లోనూ తెలుగు దేశం పార్టీ విజయం సాధించింది. వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై టీడీపీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి గెలుపొందారు. ఇదిలా ఉంటే.. పులివెందుల, ఒంటిమిట్ల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో దొంట ఓట్లతో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఓట్ల లెక్కింపుపై చాలా అనుమానాలు ఉన్నాయని అన్నారు. గురువారం ఆయన పులివెందులలో మీడియాతో మాట్లాడారు. దొంగ ఓటింగ్‌తో, ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు రానివ్వకుండా చేసుకున్న ఈ ఎన్నికలను అసలు ఎన్నికలు అని ఎలా అంటారని ప్రశ్నించారు. తమ అరాచకాల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయి అని మభ్యపెట్టేందుకే ఎల్లో మీడియా ద్వారా ఇటువంటి దిగజారుడు రాతలు రాయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇకపై ఆటలు సాగవు - ఉపాధ్యాయ హాజరు విధానంలో కీలక మార్పులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** చాలా మంది ఉపాధ్యాయులు తమ విధులను ప్రేమిస్తారు. వారు విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు. వారికి మంచి మాటలు చెప్పి బాధ్యతాయుత భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తారు. మరి కొంతమంది అయితే విధులకు తరచూ డుమ్మా కొడుతుంటారు. వీరు పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడరు. హాజరు నమోదు చేసుకున్నామా, ఆపై సొంత పనులు చక్కబెట్టుకునేందుకు ప్రాధాన్యమిస్తారు. జిల్లా కార్యాలయానికో లేదా మండల వనరుల కేంద్రానికో వెళ్తున్నట్లు తెలిపి విధులకు ఎగనామం పెడతారు. లీప్ యాప్‌లో స్పెషల్ డ్యూటీ కింద జిల్లా విద్యా కార్యాలయానికి పాఠశాల పని కోసం వెళు న్నట్లు రిజిస్టర్ చేసుకుంటారు. పాఠశాల పనికి వెళ్లకుండా, ఎక్కడికో వెళ్లి అక్కడి పాఠశాలలో హాజరు వేసి వారి సొంత పనులను చక్కబెట్టుకుంటున్నారు.

మరోచోట, ఒక ప్రిన్సిపాల్ డిప్యూటీ ట్రెజరర్ కార్యాలయానికి వెళ్తున్నట్లు రిజిస్టర్ చేసుకుని ఇంటికి వెళ్లి నిద్రపోతాడు. ఇప్పటివరకు, ఈ విషయం కొన్ని చోట్ల యథేచ్ఛగా సాగింది. ఇకపై ఇలా తప్పించుకుని ఇష్టానుసారంగా తిరగడం కుదరదు. చాలా కాలంగా కొనసాగుతున్న అసంబద్ధ విధానాలకు ముగింపు పలకాలని నిర్ణయించింది. ఇకపై మాయమాటలు చెప్పి తప్పించుకునే వారి ఆటలు సాగవు. అలాంటి వారందరికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశ్యంతో పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయ హాజరు విధానంలో కీలక మార్పులు చేసింది.

**ఎక్కడున్నదీ చెప్పేస్తుంది:** ఉపాధ్యాయులు పాఠశాల పని కోసం బయటకు వెళ్లాలనుకుంటే, వారు ఎప్పటిలాగే లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్‌లో స్పెషల్ డ్యూటీకి దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం కొత్త విధానంలో డీడీవో తన లాగిన్‌కు వెళ్లి తనిఖీ చేస్తారు. దరఖాస్తు చేసిన వారి వివరాలు పని కోసం వెళ్లిన ప్రాంతం గుర్తిస్తారు. ఆ ప్రాంత అక్షాంశాలు, రేఖాంశాలతో సహా అధికారికి తెలిసిపోయేలా లీప్ యాప్‌ను తీర్చిదిద్దారు. ఆన్‌లైన్‌లో పేర్కొన్న వివరాలు, ఉద్యోగి వెళ్లిన ప్రదేశంతో సరిపోలితే ఓటీపీ ద్వారా స్పెషల్ డ్యూటీకి అప్రూవ్ చేస్తారు. అప్పుడే హాజరు తీసుకుంటుంది. లేకుంటే గైర్హాజరు కింద చూపుతారు. దీనికి తోడు ప్రత్యేక పనిపై వెళ్లిన ఉపాధ్యాయుడు అక్కడ సంబంధిత అధికారిని కలిసినట్లు డీడీవో స్వయంగా ఫోన్ ద్వారా తెలుసుకుంటారు. తద్వారా సాకులు చూపుతూ తరచూ పాఠశాలలు ఎగ్గొట్టి బయట తిరిగే వారికి అడ్డుకట్ట పడనుంది.

**చెక్ పెట్టేందుకు ఉపయుక్తం:** విద్యాశాఖ పాఠశాల ఉపాధ్యాయుల పని తీరు మెరుగుకు మంచి మార్పు తీసుకు వచ్చింది. డీడీవోకు ముందస్తు సమాచారంతో ప్రత్యేక విధులకు అనుమతి లభిస్తుంది. దీంతో పాఠశాలల్లో విద్యా బోధనా కార్యక్రమాలు సజావుగా జరుగుతాయి. అధిక శాతం ఉపాధ్యాయులు చక్కగానే పని చేస్తున్నారు. ఆన్‌లైన్‌ను అడ్డుపెట్టుకుని కొందరే తప్పించుకొని తిరుగుతున్నారు. అటువంటి వారికి చెక్ పెట్టేలా ఈ లీప్ యాప్ సహాయపడుతుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి వివరించారు.

## నిర్ణీత సమయంలో పూర్తి చేస్తాం : కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

- నల్లపాడు ట్యాంక్ పునరుద్ధరణ - తాగునీటి వనరుగా అభివృద్ధికి రాష్ట్ర అనుమతి
- 79.47 ఎకరాల చెరువు పునరుద్ధరణతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- పునరుద్ధరణతో సాగు, భూగర్భ జలాలు మరియు పర్యావరణానికి అనుకూలం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నగరాభివృద్ధికి వరుసగా సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు. నల్లపాడు ట్యాంక్ (తెలగమాంబ చెరువు) పునరుద్ధరణ మరియు తాగునీటి వసతుల అభివృద్ధి కోసం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగింతపై అనుమతి మంజూరు చేసినందుకు ఆయన ఈ సందర్భంగా స్పందించారు.

ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధి పట్ల తన కృతనిశ్చయాన్ని మరొకసారి చాటి చెప్పే విధంగా, ఈ నిర్ణయం ద్వారా స్థానికులకు శాశ్వత తాగునీటి సౌకర్యాలు కలుగుతాయని ఆయన అన్నారు.

చెరువు పునరుద్ధరణతో భూగర్భ జలాల నిల్వలు మెరుగుపడి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, మైనర్ ఇరిగేషన్ శాఖ మరియు సంబంధిత అధికారుల సహకారంతో పనులు వేగవంతం చేసి, సమయానికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

మొత్తం 79.47 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు, ప్రస్తుత సాగు అవసరాలు కొనసాగిస్తూ, చుట్టూ వాకింగ్ ట్రాక్ అలాగే పార్కు అభివృద్ధి కూడా చేపడుతాము. ప్రజలకు శాశ్వత తాగునీటి వనరుగా మారేలా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. చెరువు అందాన్ని కాపాడుతూ, డీసిల్టింగ్ వంటి పనులు క్రమం తప్పకుండా చేపడతామని స్పష్టం చేశారు. "ప్రజల కోసం, అభివృద్ధి కోసం ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటాం. ఈ అభివృద్ధి పనులకు అనుమతులు ఇచ్చినందుకు ప్రతీ ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ శాంక్షన్‌కి సహకరించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, మరియు జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు కి, ఎమ్మెల్యే బి. రామాంజనేయులుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మార్గదర్శకుల సేవలకు అభినందనలు

- పీ-4 కార్యక్రమం గేమ్ ఛేంజర్
- ఇందులో భాగస్వాములైన అరుణకు ధన్యవాదాలు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- ప్రభుత్వ మహిళా కాలేజీలో అరుణ సహకారంలో నూతన తరగతి గదుల ప్రారంభం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సమాజంలో ఆర్థిక అంతరాలను చెరిపేస్తూ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగస్వాములైన మార్గదర్శకు లందరికీ ధన్యవాదాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో పీ-4 కార్యక్రమం కింద రూ.30 లక్షలతో నిర్మించిన మూడు తరగతి గదులను గురువారం ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 ద్వారా బంగారు కుటుంబాల జీవన విధానంలో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. మార్గదర్శకులుగా తాము విద్యనభ్యసించిన పాఠశాలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ మహిళా కళాశాలలో మూడు తరగతి గదులు నిర్మించిన శనక్కాయల అరుణ గారికి ఎమ్మెల్యే నసీర్ కృతజ్ఞతలు తెలిపారు. సమాజసేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**నూనె వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో...**

నూనెవారి ట్రస్ట్ సేవలు అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నూనె వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానికి నాజ్ సెంటర్లోని నూనెవారి సత్రంలో రూ. 1.10 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలను ఎమ్మెల్యే నసీర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనె వారిట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన బ్లాక్ లో ఆరు దుకాణాలు, రెండు గోడౌన్ల నిర్మాణాలు చేపట్టారని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జోష్నకుమారి, నరేంద్ర, డాక్టర్ విజయశ్రీ, డివిజన్ అధ్యక్షులు మండవ శ్రీనివాసరావు, బాజీ మాస్టర్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి, కొనకళ్ళ సత్యనారాయణ, కోటా శేషగిరి, హరి, రాంబాబు, EO దుర్గాప్రసాద్, EO యజ్ఞ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి

- అధిక వర్షాలకు పంటలు కాపాడుకోవడానికి సూచనలు
- ముందు జాగ్రత్తలతో నష్టాన్ని నివారించవచ్చు
- ఉద్యాన శాఖ అధికారిణి యు.శ్రీ నిత్య

**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** ప్రస్తుతం కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలను రక్షించుకునేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి యు.శ్రీ నిత్య తెలిపారు. అధిక వర్షాల ప్రభావం వలన ఉద్యాన పంటలను దెబ్బ తినకుండా సంరక్షించుకొనుటకు రైతులకు అధికారిణి పలు సలహాలు,సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారిణి శ్రీ నిత్య మాట్లాడుతూ ఉద్యాన పంట పొలాల్లో నిలువ ఉన్న అదనపు నీటిని బయటకు పంపివేయాలన్నారు. మొక్కలు బలంగా పెరగడానికి పోషకాల మోతాదులను పెంచాలన్నారు. వ్యాధికారక శిలింద్రాలను, చీడలను నివారించడానికి తగిన చర్యలను తీసుకోవాలన్నారు. లేత తోటలలో చనిపోయిన మొక్కలను తిరిగి నటుకోవాలన్నారు. వివిధ రకాల ఉద్యాన పంటలకు సంబంధించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు .

**అరటి:** ఈదురుగాలులకు విరిగిపోయిన అ-రటి తోటలలో గెలలు ఉన్నట్లయితే వాటిని కోసి మార్కెట్ చేసుకోవాలి. లేత అరటి తోటలు విరిగి పోయినట్లయితే వాటిని శుభ్రం చేసి కొత్త పిలకలను వదులుకోవాలి. వదలిన పిలకలను ప్రతి 25 రోజులకు మొక్క ఒక్కంటికి 100 గ్రా యూరియా, 80 గ్రా మ్యురేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. 2 లేదా 3 నెలల వయసు ఉన్న అరటి మొక్కలు విరిగినచో విరిగిన చోట కోసి మరల ఆ మొక్కలను పెంచవచ్చు. అరటి దుంపలు కుళ్లి పోకుండా కాపర్ అక్షిక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి దుంప చుట్టూ తడిచేటట్లు నెలలో పోయాలి.

**కూరగాయలు:** పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని ఎగదోయాలి. మొక్కలకు సరిపోయినంత ఆకులు,కొమ్మలతో ఉన్నట్లయితే 0.3 శాతం 13-0-45 లేదా 2 శాతం యూరియా ద్రావణాన్ని 2-3 సార్లు మొక్క తడిచేటట్లుగా వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. కూరగాయల పంటలు కొత్తగా విత్తిన లేదా నాటినట్లయితే వాటిని తీసివేసి మరల నాటుకోవాలి. పంటకు ఆకుమచ్చ, కాయకుళు ,, బూజు తెగుళ్ళు ఉధృతి అధికంగా ఉన్నట్లయితే ముందు జాగ్రత్త చర్యగా 2.5 గ్రా ల సాఫ్ మందును కలిపి రెండు సార్లు పిచికారి చేయాలి. వేరు కుళ్ళు ఆశించిన పొలాలలో కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రా. లేదా కార్బండిజం 10 గ్రా చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల్ మొదల్లలో పోయాలి.

**పసుపు:** వర్షాలు ఆగిన వెంటనే పంట పై లీటరు నీటికి 5 గ్రా పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి. పంటలో ఇనుప ధాతు లోపం ఏర్పడి లేత ఆకులు పాలిపోయినట్లు కనబడితే 10 లీటర్ల నీటిలో 50 గ్రా అన్నబేది ఒక నిమ్మ చెక్కరసం ,జిగురు మందుతో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. నేల అదునుకు వచ్చిన వెంటనే అంతర కృషి చేసినట్లయితే త్వరగా ఆరుతుంది. పై పాటుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 40 కిలోల పొటాష్ తో పాటు 200 కిలోల వేప పిండి వేయాలి. ఆకుమచ్చా తెగులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా ప్రాప్తికోన జోల్ 1 మీ. లి కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. దుంప కుళ్ళు ఆశించినట్లయితే పొదల్లో మొక్కలు చుట్టూ నేలను కాపర్ అక్సిక్లోరైడ్ 3 గ్రా లీటరు నీటికి కలిపి ద్రావణంతో తడపాలి.

**కంద/చేమ** :పంట కాలం 5 నెలల కన్న ఎక్కువైతే దుంపలను వెంటనే తవ్వి మార్కెట్ చేయాలి. 4 నెలల లోపు అయితే మొక్కలను తీసివేసి పొలం సాధారణ స్థితికి వచ్చిన తరువాత కొత్తగా నాటుకోవాలి. కాండం కుళు ు తెగులు ను నివారించడానికి కాపర్ అక్సిక్లోరైడ్ 3 గ్రా లి నీటికి కలిపిన మందు ద్రావణం లో మొక్క మొదలు తడిచేటట్లుగా పిచికారి చేయాలి. ఆకుమాచ్చా తెగులు నివారణకు రేడొమిల్ 2 గ్రా లీటరు నీటికి పిచికారి చేయాలి.

**తమలపాకు:** లేత మరియు ముదురు తోటలలో వంగిన అవిశలను లేపి తీగల మొక్కల దగ్గర మట్టి ఎగదోయలి తీగా నాటిన తోటలలో అవిశలను పలుచన చేసుకుంటే తేమ త్వరగా ఆరిపోతుంది. మొక్క తోటలలో తీగలను 0.5 శాతం బోర్డో మిశ్రమం ను ,500 పి పి ఎం స్ట్రెప్టో సైక్లిన్ ద్రావణం లో 15 నుండి 30 ని ముంచి నాటుకోవాలి. తీగ పాదులలో



ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని లేదా 0.3 శాతం కాపర్ అక్సి క్లోరైడ్ ను మట్టి పూర్తిగా తడిచేలా పోయాలి.

**పూల తోటలు:** మొక్కల పై 2 శాతం యూరియా లేదా 1 శాతం 13-0-45(నీటిలో కరిగే ఎరువు మల్టి కె )ను 2-3 సార్లు పిచికారి చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మీ. లి ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 1-2 సార్లు పిచికారి చేయాలి. కోతకు సిద్ధం గా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. రైతులు అధికారుల సలహాలు,సూచనలు పాటించడం వలన అధిక వర్షాల ధాటికి పంట నష్టాన్ని నివారించవచ్చు నీ తెలియజేశారు.

## ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జ్, ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు చిన్న కుమార్తె నిశ్చితార్థ వేడుకకు విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరి పట్టణం గౌతమ్ బుద్ధ రోడ్ లోని చిల్లపల్లి నాగేశ్వరరావు పార్వతిల కల్యాణ మండపంలో జరిగిన నిశ్చితార్థ వేడుకలో పాల్గొని కాబోయే దంపతులు చాముండేశ్వరి, సాయి వివేక్ లను ఆశీర్వదించారు. కాబోయే దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ కూటమి నేతలు పాల్గొన్నారు.

## బ్యాలెట్ బాక్స్ లో ఓ కాగితం.. అందులో ఏం రాసుందో తెలుసా..?



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ ఉదయం కడపలో ఓట్ల లెక్కింపు మొదలైంది. ఫలితాలు చూస్తే వైసీపీరి కనీసం డిపాజిట్ కూడా దక్క లేదు. ఓట్ల లెక్కింపు సమయంలో పులివెందుల జడ్పీటీసీ స్థానానికి సంబంధించి 25 ఓట్లుగా కట్టల కట్టేటప్పుడు బయట పడ్డ స్లిప్ బయటపడింది. ఆ స్లిప్పు ఇప్పుడు వైరల్ గా మారింది. '30 ఏళ్ల తర్వాత ఓటు వేశాను అందరికీ దండాలు' అం టూ ఆ స్లిప్పులో రాసి ఉంది. అజ్ఞాత వ్యక్తి స్లిప్ రాసి బ్యాలెట్ బాక్స్ లో వేసినట్లు భావిస్తున్నారు. ఇక్కడి ఓటర్లలో కూడా ఇదే భావం నెలకొని ఉందని కొంతకాలంగా తెలుగుదేశం పార్టీ నేతలు ప్రచారం చేశారు.

## అసెంబ్లీ సమావేశాలకు వస్తారా? రారా?.. వైఎస్ జగన్‌కు అయ్యన్నపాత్రుడు సూటి ప్రశ్న



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల ఉప ఎన్నికల ఫలితాల్లో టీడీపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యనపాత్రుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు న్యాయం వైపు నిలిచారని.. పులివెందులలో అరాచక పాలనకు బ్రేక్ వేశారని ఆయన అన్నారు. ఈ క్రమంలో పులివెందులలో ఓడారని మాజీ సీఎం వైఎస్ జగన్ ఇష్టారీతిన మాట్లాడుతున్నారని శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైఎస్ జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే అసహ్యం వేస్తోందన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అరాచకాలు చేశారని అయ్యన్న ఆరోపించారు. నామినేషన్లు కూడా వేయనీయకుండా పాలించారని చెప్పారు.

## ఆశావహులకు తీపి కబురు..

### కొత్త బార్ పాలసీని ప్రకటించిన ఏపీ సర్కార్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ లో ఎక్సైజ్ శాఖ కొత్త బార్ పాలసీ ని ప్రారంభించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 840 బార్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నూతన బార్ పాలసీ సెప్టెంబర్ 1 నుంచి అందుబాటులోకి రానుంది. ప్రజారోగ్యం, పారదర్శకత, సామాజిక సమానత్వంపై దృష్టి సారిస్తూ పాలసీని రూపొందించినట్లుగా అధికారులు పేర్కొన్నారు. కాగా, బార్ లైసెన్స్‌లకు దరఖాస్తులు స్వీకరించి లాటరీ పద్ధతిన కేటాయించనున్నారు. ప్రతి బార్ లైసెన్స్‌కు కనీసం 4 దరఖాస్తులు రావాలనే నిబంధన పెట్టారు. ఆసక్తిగల వారు అప్లికేషన్ ఫీజు రూ. 5 లక్షలు, అదనంగా రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇక లైసెన్స్ ఫీజు జనాభా ప్రతిపదనకన నిర్ణయిస్తారు. 50 వేలు కంటే తక్కువ జనాభా ఉన్న ప్రాంతాలకు రూ. 35 లక్షలు, 50 వేలు నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాలకు రూ. 55 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాలకు రూ. 75 లక్షలు ఫీజుగా నిర్ణయించారు. కొత్త బార్ పాలసీ విధానం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా బార్లు ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే నడపాలని తాజా నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467